మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 14-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 15 Issue: 15

14 జూలై 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి అమావాస్య మ. 3:15 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పునర్వసు రా. 12:09o వరకు తరువాత పుష్యమి యోగం వృఘతా ఉ. 11:54 వరకు కరణం నాగవ మ. 3:15 వరకు స్తుఘ్నుమ రా. 1:31o వరకు వర్జ్యం మ. 1:30 నుండి మ. 2:55 వరకు దుర్ముహూర్తం ఉ. 8:29 నుండి ఉ. 9:20 వరకు రా. 11:15 నుండి రా. 12:00 వరకు రాహుకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు యమగండం ఉ. 9:07 నుండి ఉ. 10:44 వరకు గుళికాకాలం మ. 12:21 నుండి మ. 1:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు రా. 10:01 నుండి రా. 11:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## అమ్మతో కలిసి గెలిచి..!

### తల్లి, కుమారుడు ఒకేసారి పట్టభద్రులు

### ఐఐటీ మద్రాస్ స్నాతకోత్సవంలో అరుదైన దృశ్యం

ఐఐటీ మద్రాస్ స్నాతకోత్సవంలో అరుదైన దృశ్యం చోటుచేసుకుంది. గుజరాత్‌కు చెందిన 45 ఏళ్ల జిగీషా టేలర్, ఆమె 21 ఏళ్ల కుమారుడు ఆదిత్య కపాడియా ఒకే వేదికపై డిగ్రీలు తీసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇద్దరూ ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసి, ఒకేసారి పట్టభద్రులు అయ్యారు.

చెన్నై: గుజరాత్‌లోని భరూచ్‌లో 16 ఏళ్ల పాటు ఎలక్ట్రానిక్స్ లెక్చరర్‌గా పనిచేసిన జిగీషా, కుటుంబ బాధ్యతల కారణంగా ఉద్యోగాన్ని వదిలేశారు. అయితే 2022లో కుమారుడి ప్రోత్సాహంతో మళ్లీ చదువు ప్రారంభించారు. కోవిడ్ కాలంలో 18 ఏళ్ల వయసులోనే ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో చేరిన ఆదిత్య, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తితో తన తరువాయి 2 వ పేజీలో...




## అమ్మాయిలంతా నిలిచి గెలిచి..!

### లార్డ్స్‌లో మన అమ్మాయిల హిస్టరీ... ఇంగ్లండ్‌పై ఘన విజయం

### రాణించిన క్రాంతి గౌనడ్, యస్తికా, స్మృతి మంధాన

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు. తొలి ఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్‌లా మారిన పేసర్ క్రాంతి గౌడ్(2-54) రెండో ఇన్నింగ్స్‌లోనేనిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

## పట్నంలో గొంతెండె!

### హైదరాబాద్‌కు నీటి గండం.. ట్యాంకర్లపై పెరుగుతున్న ఆధారం




ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా వర్షపాతంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లో తాగునీటి సమస్య ముందస్తుగానే తలెత్తుతోంది. సాధారణంగా వేసవి చివర్లో కనిపించే ట్యాంకర్ ఆధారిత నీటి సరఫరా పరిస్థితులు ఈసారి వర్షాకాలం మధ్యలోనే కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. నగర శివారు ప్రాంతాలతో పాటు పలు కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్ సముదాయాలు, ఎత్తైన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇప్పటికే ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

ఎల్‌నినో కారణంగా దక్షిణ-పశ్చిమ రుతుపవ నాలు బలహీనపడటం, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాలు పునరుద్ధరించబడకపోవడం వంటి అంశాలు నగర జలవనరులపై ఒత్తిడిని పెంచుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌కు ప్రధాన తాగునీటి వనరులైన సింగూరు, మంజీరా, కృష్ణా, గోదావరి తరువాయి 2 వ పేజీలో...



## పల్లెలో చెలక ఎండె!

### రైతన్నకు నీటి కష్టాలు .. బోర్లపై పెరుగుతున్న ఆధారం


రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి సాగునీటిని ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆయకట్టు ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో వేలాది మంది రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, యాదాద్రి-భువనగిరి, నల్గొండ తదితర జిల్లాల్లోని ఆయకట్టు భూములకు ఈ కాలంలో సాగునీరు అత్యంత కీలకం. కానీ కాలువల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో నాట్లు వేసిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వాడిపోతున్నాయి. కొన్నిచోట్ల రైతులు బోర్లు, ప్రైవేట్ మోటార్లపై ఆధారపడుతున్నా భూగర్భ జలాలు కూడా అడుగంటడంతో పరిస్థితి తరువాయి 2 వ పేజీలో...

## టీజీ టెట్ ఫలితాలు విడుదల

### 50,544 మంది అర్హత.. త్వరలో 'స్పెషల్ టెట్' నిర్వహణ



హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష టీజీ-టెట్ 2026 ఫలితాలు సోమవారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. ఈ ఏడాది జూన్ 16 నుంచి జూన్ 22 వరకు మొత్తం 10 సెషన్లలో తరువాయి 2 వ పేజీలో...





**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,482 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,997 |

## పోలవరం పిటిషన్‌లో అన్నీ తప్పులే

### వాజ్యంలో అనేక సాంకేతిక లోపాలు



**సరిదిద్దితేనే ఏపీకి నోటీసులు ఎట్లిస్తం?.. తెలంగాణ సర్కారుకు సుప్రీం స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరఫు న్యాయవాది కోరారు. అయితే.. ప్రధాన పిటిషన్‌లోనే పలు సాంకేతిక లోపాలు ఉన్నాయని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తెలిపింది. అందులో ఉన్న లోపాలను సరిదిద్దకుండా కేసు విచారణను ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదని క్లారిటీ ఇచ్చింది. ముందుగా నిబంధనలకు అనుగుణంగా ఆ పిటిషన్‌ను సవరించాలని.. ఆ తర్వాతే కేసులోని ఇతర అంశాలను పరిశీలిస్తామని తరువాయి 2 వ పేజీలో...

## మార్చినాటికి పోలవరం పూర్తి చేస్తం

### పుష్కరాలలోపే జాతికి ప్రాజెక్టు అంకితం


**అధికారులతో సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు**

**పనులు 89 శాతానికి చేరుకున్నాయని వెల్లడి**




అమరావతి, జూలై 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, ప్రభుత్వ లక్ష్యాలను ఆయన వెల్లడించారు. 2026 ఆగస్టు 14న, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒకరోజు ముందు, ఎడమ ప్రధాన కాలువ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



గులాబీ పువ్వు పరిమళం కేవలం మనసుకు ఆహ్లాదాన్ని కలిగించడమే కాకుండా, మెదడు నిర్మాణంలో కూడా సానుకూల మార్పులకు దోహదపడవచ్చని జపాన్‌లో నిర్వహించిన తాజా అధ్యయనం వెల్లడించింది. నిరంతరం గులాబీ సువాసనకు గురికావడం వల్ల మెదడులోని గ్రే మ్యాటర్ పరిమాణం పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనంలో 28 మంది మహిళలు ఒక నెలపాటు తమ దుస్తులపై గులాబీ ఎసెన్షియల్ ఆయిల్‌ను ఉపయోగించగా, మరో 22 మంది నియంత్రణ బృందం సభ్యులు సాధారణ నీటిని మాత్రమే ఉపయోగించారు. అనంతరం నిర్వహించిన మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ పరీక్షల్లో గులాబీ పరిమళానికి గురైన మహిళల మెదడులో గ్రే మ్యాటర్ పెరిగినట్లు గుర్తించారు. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, అనుబంధ ఆలోచనలతో సంబంధం ఉన్న పోస్టీరియర్ సింగ్యులేట్ కార్టెక్స్ ప్రాంతంలో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించింది.

## సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆత్మహత్య



### మేనమామ ఊరిలో బలవన్మరణం

**సెల్ఫీ వీడియో.. అమ్మాయిని నమ్మి మోసపోయానని వెల్లడి**

షాబాద్ హత్య కేసుల నిందితుడు రాజ్‌కుమార్ మృతిచెందాడు. కొత్తూరు సమీపంలోని పెంజర్ల వద్ద అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. షాబాద్ మండలం దైవాలగూడ సామూహిక హత్యల కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతున్న సమయంలో అతని మృతదేహం లభించడం చర్చనీయాంశమైంది.

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): మూడు రోజుల క్రితం ఆరుగుర్ని అతి కిరాతకంగా హత్య చేసి పారిపోయిన రాజ్‌కుమార్ కోసం తెలుగు రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎలాగైనా పోలీసులు పట్టుకుంటారని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చవని భావిస్తున్నారు. రాజ్‌కుమార్ మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ కనబడింది. రాజ్‌కుమార్ మృతదేహం కనిపించిన ప్రదేశం అతడి మేనమామ ఊరే. షాబాద్ నరహంతకుడు రాజ్ కుమార్ కేసులో పోలీసులు కీలక సమాచారం సేకరించారు. హత్యలకు ఒక రోజు ముందు తరువాయి 2 వ పేజీలో...



## లెక్కాపత్రం ఉండాలె

### హేతుబద్ధంగా పౌరసత్వ నిర్ధారణ.. సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఒక వ్యక్తికి చెందిన పౌరసత్వ నిర్ధారణ అనేది రాజ్యాంగపరంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశమని, అందువల్ల ఈ ప్రక్రియ తప్పనిసరిగా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, హేతుబద్ధంగా సాగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అసోంలోని వివిధ 'ఫారినర్స్ ట్రిబ్యునళ్లు' 27 మందిని విదేశీయులుగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పులను గతంలో గౌహతి హైకోర్టు సమర్థించింది.

న్యూఢిల్లీ: అయితే ఆ హైకోర్టు ఉత్తర్వులను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పక్కన పెట్టింది. బాధితులు దాఖలు చేసిన 27 అప్పీళ్లను స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం వీటిపై నిష్పక్షపాతంగా సరికొత్త విచారణ తరువాయి 2 వ పేజీలో...

## గోవధను నిషేధించలేం

### మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు చెల్లవు.. సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వులు

తమిళనాడు వ్యాప్తంగా గోవధను సంపూర్ణంగా నిషేధించాలంటూ మద్రాస్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర స్టే విధించింది. హైకోర్టు ఇచ్చిన ఈ వివాదాస్పద తీర్పును సవాలు చేస్తూ, తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది.

న్యూఢిల్లీ: బక్రీద్ లేదా మరే ఇతర రోజుల్లోనైనా ఆవులు, దూడల వధను పూర్తిగా నిషేధించాలని మే 27న మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల్లో గోవధను అరికట్టాలని కోరుతూ హిందూ మక్కల్ కట్చి ప్రధాన కార్యదర్శి కె. సూర్య ప్రశాంత్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా.. హైకోర్టు ఒక పరిధిని మించి పూర్తి నిషేధాన్ని విధించిందని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. లైసెన్స్ పొందిన వధశాలల్లో కూడా ఆవుల వధను నిషేధించడం చట్టవిరుద్ధమని ప్రభుత్వం పేర్కొంది. తమిళనాడు జంతు సంరక్షణ చట్టం 1958, పట్టణ స్థానిక సంస్థల చట్టం 1998, 2023 నిబంధనలు జంతువుల వధను క్రమబద్ధీకరించడానికే ఉద్దేశించినవని, పూర్తిగా నిషేధించడానికి కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వుల అమలుపై మధ్యంతర స్టే మంజూరు చేసింది.

## రాశి ఫలాలు

14.7.2026

మేషం: ఈరోజు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూలమైన ఫలితాలు కనిపిస్తాయి. చేపట్టిన పనులు ఆశించిన విధంగా పూర్తవుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యుల సహకారం అన్ని విధాలుగా లభిస్తుంది. ఆరోగ్యంపై స్వల్ప శ్రద్ధ వహిస్తే రోజు ప్రశాంతంగా గడుస్తుంది.

వృషభం: కొత్త అవకాశాలు మీ ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఉద్యోగంలో మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆదాయంలో స్వల్ప పెరుగుదల కనిపిస్తుంది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. ప్రయాణాలకు అనుకూలమైన రోజు.

మిధునం: పని ఒత్తిడి ఉన్నప్పటికీ సమయానికి పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. కుటుంబ సభ్యులతో అనుబంధం బలపడుతుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

కర్కాటకం: చాలాకాలంగా ఎదురుచూస్తున్న పనులు ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకుంటాయి. వ్యాపారంలో లాభదాయకమైన అవకాశాలు లభిస్తాయి. కుటుంబంలో శుభవార్తలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఖర్చులను నియంత్రించడం మంచిది.

సింహం: మీ నిర్ణయాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. అధికారులతో జరిగే చర్చలు విజయవంతమవుతాయి. ఆర్థిక పరిస్థితి బలపడుతుంది. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. కొత్త పనులు ప్రారంభించడానికి అనుకూలమైన రోజు.

కన్య: ఉద్యోగంలో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. వ్యాపారంలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యపరంగా చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాన్ని అందుకుంటారు.

తుల: చేపట్టిన పనులు కొంత ఆలస్యమైనా చివరకు విజయవంతంగా పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో ప్రణాళికతో వ్యవహరించడం మంచిది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఉద్యోగంలో సహచరుల సహకారం లభిస్తుంది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి.

వృశ్చికం: భాగస్వామ్య వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందే అవకాశం ఉంది. ఆర్థిక లాభాలు పొందుతారు. కుటుంబంలో ఆనందకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

ధనస్సు: మీ కృషికి తగిన ఫలితం లభిస్తుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. ఆదాయం పెరిగే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన నిర్ణయాలను ధైర్యంగా తీసుకోవచ్చు.

మకరం: ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం మంచిది.

కుంభం: వ్యాపారంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో మీ పనితీరుకు ప్రశంసలు దక్కుతాయి. ఆర్థికంగా లాభదాయకమైన రోజు. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. కుటుంబంలో ఆనందం పెరుగుతుంది.

మీనం: ఈరోజు అదృష్టం మీకు అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఆరోగ్యం సాధారణంగా అనుకూలంగా ఉంటుంది.

# పట్నంలో గొంతెండె!

మొదటి పేజీ తరువాయి

నీటి పథకాల నుంచే ఎక్కువ భాగం సరఫరా అవుతోంది. అయితే వర్షపాతం తగ్గితే రిజర్వాయర్లలోకి వచ్చే నీటి ప్రవాహం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. దీనివల్ల నీటి నిల్వలపై ఒత్తిడి పెరిగి, నగర అవసరాలను తీర్చడం మరింత సవాలుగా మారుతోంది. అటు.. గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో భారీగా నిర్మాణాలు, కాంక్రీటీకరణ, చెరువుల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణ లోపించడం వల్ల భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోతోంది. ప్రస్తుతం వర్షాలు సరిగా లేకపోవడంతో బోర్‌వెల్లు ఎండిపోతున్నాయని, అనేక కాలనీల్లో మోటార్లు గంటల తరబడి నడిపినా నీరు రావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ట్యాంకర్లకు భారీ డిమాండ్

నగరంలో ప్రైవేట్ నీటి ట్యాంకర్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. సాధారణ రోజుల్లో లభించే ట్యాంకర్లు ఇప్పుడు ముందస్తు బుకింగ్ లేకుండా అందుబాటులో ఉండటం లేదు. డిమాండ్ పెరగడంతో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ ధరలు కూడా పెరిగినట్లు




వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిసరాలు, శివారు కాలనీలు, కొత్త రెసిడెన్షియల్ వెంచర్లలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఎల్‌నినో ప్రభావం కొనసాగితే రుతుపవనాల పనితీరు మరింత బలహీనపడే అవకాశం ఉంది. దీంతో నగరానికి నీటి సరఫరా చేసే జలాశయాల్లో నిల్వలు ఆశించిన స్థాయిలో పెరగకపోవచ్చు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే నెలల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలోనే నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి రావడంతో నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం మరింత పెరిగితే వచ్చే వేసవిలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందనే భయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, జలమండలి, ప్రజలు సమిష్టిగా జల సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.



# పల్లెలో చెలక ఎండె!

మొదటి పేజీ తరువాయి

మరింత క్లిష్టంగా మారింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూలై నెలలో కురవాల్సిన వర్షాలు అనేక ప్రాంతాల్లో తగ్గుముఖం పట్టాయి. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చెరువులు, కుంటలు నిండకపోవడం రైతులకు పెద్ద దెబ్బగా మారింది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో నేలలో తేమ వేగంగా తగ్గిపోతోంది. దీంతో మొలకెత్తిన పంటలు నీటి కొరతతో ఎండిపోతున్నాయి.

### కాళేశ్వరం నీటిపైనే ఆశలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వెనుక ప్రధాన ఉద్దేశం గోదావరి జలాలను ఎత్తిపోసి సాగుకు అందించడం. వర్షాలు తక్కువగా ఉన్న సమయంలో కూడా ఆయకట్టు ప్రాంతాలకు నీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టును రూపొందించారు. అయితే ప్రస్తుతం కాలువలకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. సమయానికి నీరు అందకపోతే ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకోవడం కష్టమవుతుందని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు నీటి కోసం అదనపు ఖర్చులు చేయాల్సి వస్తోంది.

బోర్ల ద్వారా సాగు చేయడానికి విద్యుత్, డీజిల్ ఖర్చులు పెరగడంతో ఆర్థిక భారం మరింత అధికమైంది. పంటలు దెబ్బతింటే అప్పులు తీర్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడాలంటే కాళేశ్వరం నుంచి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాల కోసం ఎదురుచూడకుండా పరిస్థితిని అంచనా వేసి నీటి నిర్వహణ చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు ప్రాధాన్యత ఆధారంగా నీటిని అందించాలని కోరుతున్నారు. అలాగే ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలు, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు నష్టపోయే రైతులకు ముందస్తు సహాయ చర్యలు ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి కొరత ఒకేసారి తెలంగాణ వ్యవసాయ రంగంపై తీవ్ర ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సాగునీటి నిర్వహణలో ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోకపోతే ఖరీఫ్ సీజన్‌లో దిగుబడులు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# టీజీ టెట్ ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,15,028 మంది పరీక్షకు హాజరయ్యారు. తుది ఫలితాలలో మొత్తం 50,544 మంది అభ్యర్థులు అర్హత సాధించి, 43.94 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. పురుషుల కంటే మహిళలే టెట్‌లో సత్తా చాటారు. మొత్తం క్వాలిఫై అయిన వారిలో మహిళలు 32,970 మంది ఉండగా, పురుషులు 17,568 మంది, ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు ఉన్నారు. పేపర్ల వారీగా చూస్తే.. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి బోధనకు ఉద్దేశించిన పేపర్-1 లో అత్యధికంగా 65.29 శాతం మంది క్వాలిఫై అయ్యారు. అయితే ఆరు నుంచి ఎనిమిదో తరగతి బోధనకు రాసే పేపర్-2 ఫలితాల్లో మాత్రం గణనీయమైన తేడాలు కనిపించాయి. పేపర్-2 మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగంలో 40.76 శాతం మంది అర్హత సాధించగా, సోషల్ స్టడీస్ విభాగంలో అత్యల్పంగా కేవలం 25.79 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ టీచర్లకు టెట్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఈ పరీక్షలో 23,623 మంది ఇన్ సర్వీస్ టీచర్లు పరీక్ష రాయగా వారిలో 8,809 మంది మాత్రమే అర్హత సాధించారు. ఇదే సమయంలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు విద్యాశాఖ మరో కీలక ప్రకటన చేసింది. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూల్స్ మరియు రెసిడెన్షియల్ సొసైటీల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక నోటిఫికేషన్‌ను జూలై 21, 2026న విడుదల చేసి, సెప్టెంబర్ 7 నుండి సెప్టెంబర్ 11, 2026 మధ్య కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సైకో కిల్లర్ రాజ్‌కుమార్ ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

నిందితుడు తన ఫోన్‌లో ఒక సెల్ఫీ వీడియో తీసినట్లు తెలిపారు.. అందులో " నేను అమ్మాయిని నమ్ముకొని చాలా మోసపోయా, ఆ కుటుంబం నన్ను అన్ని విధాలా వాడుకుంది. నాపై కేసు పెట్టి నన్ను మోసం చేశారు. అందుకే వాళ్లని చంపాలనుకున్నా చివరకి నా పిల్లలకి కూడా భూమి లేకుండా పోయింది. డబ్బుమట్నుత్తం ఇచ్చేసి అప్పులపాలయ్యాను జీవితం మీద విరక్తి కలిగింది." అని రికార్డు చేసినట్లు తెలిపారు. షాబాద్ నిందితుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన అనంతరం అతని వద్ద లభించిన మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

# పోలవరం పిటిషన్‌లో అన్నీ తప్పులే

మొదటి పేజీ తరువాయి

ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇక.. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకముందే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడం లేదా ఈ వ్యవహారంలో తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వడం న్యాయపరంగా సాధ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో రెండు రాష్ట్రాల నదీ జలాల విషయంలో తక్షణమే స్టే ఇవ్వడంతోపాటు.. ఏపీ సర్కార్‌కు నోటీసుల జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. మరోవైపు.. ఆ పిటిషన్‌లోని లోపాలను సరిచేసిన తర్వాత తిరిగి దానిపై విచారణ చేపట్టి.. మిగిలిన న్యాయపరమైన అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో పోలవరం ప్రాజెక్టు, గోదావరి జలాల వినియోగం, బనకచర్ల అనుసంధానానికి సంబంధించిన వివాదంలో ఏం జరగనుంది అనే పరిణామాలపై ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల దృష్టి సుప్రీంకోర్టు తదుపరి విచారణపైనే నిలిచింది.

# అమ్మతో కలిసి గెలిచి..!

మొదటి పేజీ తరువాయి

చదువును కొనసాగించాడు. తర్వాత డిప్లొమా కోర్సును విడిచి పూర్తిగా ఐఐటీ మద్రాస్ బీఎస్ డిగ్రీపై దృష్టి పెట్టాడు. 2024లో బీఎస్ పూర్తి చేసిన ఆదిత్య ప్రస్తుతం డేటా సైన్స్ రంగంలో ఉద్యోగం చేస్తున్నాడు. జిగీషా మాత్రం చిన్న కుమారుడి చదువు పూర్తయ్యాక మళ్లీ ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని భావిస్తున్నారు.

# మార్చినాటికి పోలవరం పూర్తి చేస్తం

మొదటి పేజీ తరువాయి

ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేసి చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుడతామని కీలక ప్రకటన చేశారు. అక్కడ తాను స్వయంగా జలహారతి ఇచ్చి గోదావరి జలాలకు స్వాగతం పలుకుతానని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2019 నాటికి 72 శాతం పనులు తాము పూర్తి చేస్తే, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని ఆరోపించారు. ప్రాజెక్టుపై కక్ష సాధింపు, ఏజెన్సీలను మార్చడం, పీపీఏ సూచనలను పెడచెవిన పెట్టడం వంటి చర్యల వల్ల ప్రాజెక్టు భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ముఖ్యంగా, ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీలు వదిలేయడం వల్ల వచ్చిన వరదలకు రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని, దీనిని గుర్తించడంలో గత ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. దీని ఫలితంగా ఇప్పుడు దానికి సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్‌ను రూ.990 కోట్ల అదనపు వ్యయంతో యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేశామని, గత రెండేళ్లలో 15% పనులు పూర్తి చేసి మొత్తం పురోగతిని 89 శాతానికి చేర్చామని చంద్రబాబు వివరించారు. ఇప్పటివరకు రూ.7,100 కోట్లు ఖర్చు చేశామని, కేంద్రం నుంచి మరో రూ.3,835 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. స్పిల్‌వే, రేడియల్ గేట్లు, కాఫర్ డ్యామ్ పనులు పూర్తయ్యాయని, 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా గేట్లను ఏర్పాటు చేశామని



చెప్పారు. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, గ్యాప్-1 48 శాతం, గ్యాప్-2 30 శాతం చొప్పున పూర్తయ్యాయని తెలిపారు. భూసేకరణ 94,152 ఎకరాలు పూర్తయిందని, అక్టోబర్ 26 నాటికి 100 శాతం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయడానికి నిర్దిష్ట కార్యాచరణ, ప్రారంభోత్సవ తేదీలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూడటమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఇకపై ప్రతినెలా ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.

## ఈశ్వరమ్మపై వ్యాఖ్యలను ఖండించిన
# ఓయూ విద్యార్థి నాయకులు

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): యాదాద్రి దేవస్థానం కమిటీ సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు తీవ్రంగా ఖండించారు. ఓయూ విద్యార్థి నాయకుడు కడారి రమేష్ యాదవ్ మాట్లాడుతూ, ఈశ్వరమ్మ యాదవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో తన ఫోటో, తన తండ్రి జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టలేదంటూ ఆమె కుటుంబ సభ్యులను ఫోన్‌లో బెదిరించడం, అవమానకరమైన భాషలో మాట్లాడడం ఖండనీయమన్నారు. 82 ఏళ్ల వయస్సు కలిగిన బీసీ మహిళ పట్ల కనీస గౌరవం లేకుండా మాట్లాడడం బాధాకరమని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని విమర్శించారు. ఈ ఘటనపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి శివ చరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ, బహుజన వర్గాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన దళిత, బహుజన, బీసీ విద్యార్థి నాయకులు మనోహరాచారి, శంకర్ యాదవ్, రామకృష్ణ, ప్రశాంత్, కిషోర్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థులకు ఆది అల్బెండజోల్ పంపిణీ

వేములవాడ అర్బన్, జూలై 13 (ఈవార్తలు): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి సంవత్సరం రెండు సార్లు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యారంగంలో పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# భీమన్న సేవలో ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్, జూలై 13 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు వేదమంత్రోచ్చారణలు, స్వస్తివాచనంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ మండపంలో తీర్థప్రసాదం అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# మల్యాల ప్రభుత్వ పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ

మల్యాల, జూలై 13 (ఈవార్తలు): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది 1 నుంచి 19 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచితంగా అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి, నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణ ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించడంతో పాటు పిల్లల శారీరక ఎదుగుదలకు, ఆరోగ్యానికి దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొట్ల జయ, ఉపసర్పంచ్ కటకం వినయ్, ఏఎన్ఎం జమున, పాఠశాల ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణే ఫస్ట్

**రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం**

**ఎంపీలు సమన్వయంతో పనిచేయాలి.. సీఎం రేవంత్ రెడ్డి హితవు**

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర దీర్ఘకాల ప్రయోజనాల సాధనే లక్ష్యంగా అన్ని పార్టీల ఎంపీలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు, కేంద్ర అనుమతుల సాధన కోసం సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం మాట్లాడిన సీఎం, కేంద్ర ప్రభుత్వ అనుమతులు అవసరమైన కీలక ప్రాజెక్టులపై ఎంపీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి అనుమతులు సాధించాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ, ఫేజ్-1 స్వాధీనం ప్రక్రియ వేగవంతం చేసేందుకు కేంద్రంతో చర్చలు కొనసాగించాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు, దక్షిణ భాగం భూసేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం సాధించాలని తెలిపారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ఆమోదం తీసుకురావాలని ఎంపీలను కోరారు. తుంగభద్ర జలాల విషయంలో తెలంగాణకు రావాల్సిన నీరు పూడిక కారణంగా తగ్గుతోందని సీఎం పేర్కొన్నారు. డ్యామ్, కాలువల్లో పూడిక తొలగింపునకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహకారం అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని ఎంపీలను కోరారు. గోదావరి-నాగార్జునసాగర్ అనుసంధానం, గోదావరి--కావేరి లింక్, ఛత్తీస్‌గఢ్‌తో జల వివాదాల పరిష్కారంపైనా కేంద్రంతో చర్చించాలని సూచించారు.

# రేవంత్.. ఇంజినీర్లకు సారీ చెప్పు

**పదవి ఉందని విర్రవీగితే ఊరుకోం.. ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరిక**



హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో బీఆర్ఎస్ నేతలు, రిటైర్డ్ ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, అహంకారంతో నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఖబర్దార్ రేవంత్ రెడ్డి! పదవి ఉ ందనే అహంకారంతో మాట్లాడితే చూస్తూ ఊరుకోం. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాత్రింబగళ్లు కష్టపడిన ఇంజినీర్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలి'అని డిమాండ్ చేశారు. 2023లో లక్ష్మీ బ్యారేజ్ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోయాయి. డిజైన్ల తప్పుంటే విచారణ చేసి ఇంజినీర్లను, క్వాలిటీలో లోపాలు ఉంటే ఆ కాంట్రాక్టర్‌ను, అలాగే ఎవరి సలహా పట్టించుకోకుండా నాటి పాలకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఉంటే నాటి పాలకులను బాధ్యులను చేసి శిక్ష వేయాలన్నారు. కాగితాలకే పరిమితమైన ఎస్సారెస్పీ ఆయకట్టులో రెండు పంటలు పండాయి. మేడిగడ్డ కూలిపోయింది, అన్నారం, సుందిళ్ల పనికిరావని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి తప్పించుకుంటున్న ముఖ్యమంత్రి ఇక్కడి రిటైర్డ్ ఇంజినీర్లు, సాగునీటి నిపుణుల సూచనలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బ్యారేజీతో సంబంధం లేకుండా కన్నెపల్లి నుంచి నీళ్లు తీసుకోవచ్చని ఇంజినీర్లు సూచిస్తున్నా, ముఖ్యమంత్రి భేషజాలకు పోతూ తెలంగాణ రైతాంగం నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపారు. అనంతరం రిటైర్డ్ ఇంజనీర్లు దామోదర్ రెడ్డి, వెంకటేశం, శ్రీధర్ దేశ్ పాండే, వెంకట రామారావులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎల్‌నీనో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రాజెక్టుల్లో నిల్వ ఉన్న నీళ్లు డెడ్ స్టోరేజీకి చేరాయన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటికి, పరిశ్రమలకు నీళ్లు కావాలంటే ముఖ్యమంత్రి తాము చేసిన సూచనలే కాదు, కేంద్ర ప్రభుత్వ నిపుణుల సలహాలు తీసుకుని అయినా నీళ్లను ఎత్తిపోయాలన్నారు. రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసుకునే వెసులుబాటు, అందుకు కావాల్సిన యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందన్నారు. గోదావరిలో ప్రాణహిత వద్దనే నీటి లభ్యత ఉంటుందని సీడబ్ల్యూసీ కూడా పేర్కొన్నదని వారు గుర్తు చేశారు. మేడిగడ్డ నింపితే కూలిపోతుందని, భద్రాచలం మునిగిపోతుందని ముఖ్యమంత్రి భయపెట్టే ప్రకటనలు చేస్తున్నారని, ఆ వాదనలు తప్పన్నారు. ప్రస్తుతం వస్తున్న వరదల కంటే రెట్టింపు స్థాయిలో నీళ్లు వచ్చినా ఏమీ కాలేదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని నీళ్లను ఎత్తిపోయాలన్నారు. లేకపోతే కరెంటు సమస్యలు కూడా తలెత్తుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక నిపుణులు పి. పాపారావు, బీజేపీ నేత వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నేత చిరుమల్ల రాకేష్, సీనియర్ జర్నలిస్టులు గొర్ల బుచ్చన్న, ఎ. రమణ కుమార్, నర్రా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినోపై తెలంగాణ సర్వసన్నద్ధం

**మూడు దశల ముందస్తు కార్యాచరణ .. రైతులకు నష్టం లేకుండా చర్యలు: తుమ్మల**




హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి దశలో అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, క్రిడా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల ఉ న్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను సమావేశంలో పరిశీలించి, శాస్త్రవేత్తల సూచనల మేరకు తుది కార్యాచరణను ఖరారు చేశారు. ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. అవసరమయ్యే విత్తనాలను ముందుగానే సమీకరించి రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని రైతులకు వివరించి, వాటిని కచ్చితంగా అమలు చేసేలా చూడాలని సూచించారు. వాతావరణం, భూగర్భ జలాలు, సాగునీటి లభ్యత, నేల తేమ, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితి వంటి అంశాలపై ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమాచారాన్ని రైతు వేదికలు, గ్రామపంచాయతీలు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా, స్థానిక మీడియా ద్వారా రైతులకు చేరవేయాలని సూచించారు. వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేయడం, నేల తేమను సంరక్షించే పద్ధతులు పాటించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను అనుసరించడం వంటి చర్యలను రైతులు పాటించాలని శాస్త్రవేత్తలు సూచించినట్లు మంత్రి తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి రైతులకు పంటల దశను బట్టి ప్రత్యేక సూచనలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసందలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినో ప్రభావం, నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ సాగు, నేల తేమ సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. సమీక్షలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, హాకా ఎండీ చంద్రశేఖర్, గిడ్డంగుల సంస్థ ఎండీ లక్ష్మీ, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల వీసీలు, శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్వింద్‌కు అవగాహన లేదు

**పనులు తక్కువ.. మాటలు ఎక్కువ!**

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

జగిత్యాల, జూలై 13 (ఈవార్తలు): కేంద్రీయ విద్యాలయం భూమిపూజ కార్యక్రమం అనంతరం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యానికి నిదర్శనమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ విమర్శించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ నిధులు తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్రీయ విద్యాలయం భూమిపూజకు ఎంపీ రారని, ప్రారంభోత్సవానికి మాత్రమే వస్తారని చెప్పడం సరైన అవగాహన లేక చేసిన వ్యాఖ్యేనన్నారు. ప్రజలు తిరస్కరించారని చెబుతూనే మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పార్టీ కోసం శ్రమించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను విస్మరించడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జగిత్యాలకు గురుకుల పాఠశాలలు, మహిళా డిగ్రీ కళాశాల, అటానమస్ కళాశాల, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, పోలాస కళాశాల నూతన భవనం వంటి అనేక విద్యాసంస్థలు వచ్చాయని గుర్తుచేశారు. చలిగల్ గ్రామంలో రైతుల నుంచి భూమి సేకరించి కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. సహజ వ్యవసాయం, రైతులకు ఎరువుల పంపిణీ వంటి అంశాలపై కూడా ఎంపీ అరవింద్‌కు పూర్తి అవగాహన లేదని విమర్శించిన ఎమ్మెల్యే, "పనులు తక్కువ... మాటలు ఎక్కువ. ఇకపై ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదు" అంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, బండ శంకర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25, 26న జగిత్యాలకు జనజాగరణ యాత్ర

**టీఎస్ సీపీఎస్ ఈయూ గోడపత్రిక ఆవిష్కరణ**

జగిత్యాల, జూలై 13 (ఈవార్తలు): పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు సాధనే లక్ష్యంగా టీఎస్ సీపీఎస్ ఈయూ చేపట్టిన జనజాగరణ బస్సు యాత్ర జగిత్యాల జిల్లాకు జూలై 25, 26 తేదీల్లో రానుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేజీఆర్ పాఠశాలలో సోమవారం జనజాగరణ యాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004 సెప్టెంబరు 1 తర్వాత నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం లేకపోవడంతో పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత, కనీస పెన్షన్ కరువై అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో 33 జిల్లాల గుండా జనజాగరణ బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జగిత్యాల జిల్లాలో నిర్వహించే యాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, అలాగే ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరై సీపీఎస్ రద్దు ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చుక్క కిరణ్, సందుపట్ల రమేష్, సిర్రా శ్రీనివాస్, అనుమల్ల నరేందర్, ఉషకోల శివప్రసాద్, జోగం శ్రీనివాస్, నీలం సంపత్, బండారి సతీష్, చిట్టినేని విజయ్, జిల్లా ఆర్పీలు గుండు విజయ్, అన్నం మహేష్, అభయ్‌రాజ్, ప్రవీణ్, దాసరి జయంత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దాశరథి అవార్డు ఎంపికకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు**

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి ఉత్సవాల సందర్భంగా ఇవ్వబోయే ప్రతిష్ఠాత్మక శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు-2026 ఎంపిక కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ సమర్పించిన ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రముఖ సాహిత్యవేత్తను ఈ అవార్డుకు ఎంపిక చేసే బాధ్యతను కమిటీకి అప్పగించారు. కమిటీ చైర్మన్ గా డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ (రచయిత) సభ్యులుగా జయరాజు (కవి), డాక్టర్ యాకూబ్ (కవి), సుంకిరెడ్డి నారాయణరెడ్డి (కవి, రచయిత), నెల్లుట్ల రమాదేవి (కవి) సభ్యుడు, కన్వీనర్ గా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డిలు ఉన్నారు. ఈ కమిటీ అర్హులైన ఒక ప్రముఖ సాహితీవేత్త పేరును పరిశీలించి, తుది నిర్ణయం కోసం ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: టీడబ్ల్యూజేఎఫ్

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట హెచ్‌యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన చేపట్టి, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి, డీఆర్వో నారాయణకు వినతిపత్రం అందజేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలులో పురోగతి లేదని విమర్శించారు. అర్హులైన జర్నలిస్టులకు నిబంధనల పేరుతో అక్రిడిటేషన్ కార్డులు నిరాకరించడం సరికాదని, అవసరమైతే నిబంధనలను సడలించి కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, ఇండ్ల స్థలాల అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చొరవ తీసుకోవాలని కోరారు. హెచ్‌యూజే ప్రధాన కార్యదర్శి బి. జగదీశ్వర్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ పాస్‌లపై ప్రకటించిన మూడో వంతు చార్జీ రాయితీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. టోల్, సెస్ పేరుతో అదనపు భారం పడుతోందని, ఆర్టీసీ బస్సులు, హైదరాబాద్ మెట్రోలో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ అమలు చేయాలని కోరారు. టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే నాయకులు ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై తక్షణమే స్పందించాలని కోరుతూ, ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఐ అండ్ పీఆర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాలో రాష్ట్ర నలుమూలల నుంచి జర్నలిస్టులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. నిరంజన్, డీజేఎఫ్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్‌తో పాటు పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ 'సింగరేణి భరోసా యాత్ర'

**ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు ప్రచారమే లక్ష్యం**

హైదరాబాద్, జూలై 13 (ఈవార్తలు): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు.




# అయోధ్య కేసులో కేంద్రానికి నోటీసులు

## సిట్ దర్యాప్తు స్టేటస్ రిపోర్టు తెండి

### యూపీ సర్కారుకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ: అయోధ్య రామాలయం విరాళాల వివాదానికి సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విరాళాల చోరీ కేసు పై విచారణలో సుప్రీం ప్రతి వాదులకు నోటీసులు జారీచేసింది. అలాగే సిట్ దర్యాప్తు స్టేటస్ రిపోర్టు ఫైల్ చేయాలని యూపీ ప్రభుత్వానికి ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదావేసింది.**

విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ద్వారా దర్యాప్తు జరుపుతోందని కోర్టుకు తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.



అయోధ్య రాముడి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నిధుల దుర్వినియోగం, ఆర్థిక అక్రమాలపై కేంద్రీయ దర్యాప్తు సంస్థ సీబీఐ స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. వేసవి సెలవుల తర్వాత సుప్రీంకోర్టు పునఃప్రారంభమైన మొదటి రోజే ఈ కీలకమైన కేసు విచారణకు రావడం గమనార్హం. రామాలయ నిర్మాణం కోసం సేకరించిన ప్రజా విరాళాలను దుర్వినియోగం చేశారని, నిధుల మళ్లింపు జరిగిందని ఆరోపిస్తూ న్యాయవాదులు, ఆర్‌జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ సహా మరికొందరు వేర్వేరుగా ఈ పిటిషన్లను దాఖలు చేశారు. ఇందులో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోంది. అయితే, సంక్లిష్టమైన ఆర్థిక నేరాలను దర్యాప్తు చేయడానికి అవసరమైన ఫోరెన్సిక్ మరియు తగిన వనరులు రాష్ట్ర సిట్ వద్ద లేవని, పైగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండానే దర్యాప్తు ప్రారంభించారని పిటిషనర్లు వాదన.దేశవ్యాప్తంగా కోట్ల మంది భక్తుల నమ్మకానికి సంబంధించిన విషయం కావడంతో, దీనిపై సీబీఐ నేతృత్వంలో నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని, అలాగే ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై కాగ్ లేదా స్వతంత్ర సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కూడా కోరారు.



## బంకిపూర్‌లో నాదే గెలుపు: పీకే

పాట్నా: బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండడం తెలిసిందే. బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం నాడు పాట్నా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ, ఉపఎన్నిక ఫలితంపై ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్లు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంప్రదాయ రాజకీయాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల ఈ పోటీ తమకు ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్రంలో రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని, జన్ సురాజ్ విజన్ పట్ల పెరుగుతున్న మద్దతుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని ప్రశాంత్ కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ముంబైకి వియత్నాం బోటు ప్రమాద మృతదేహాలు

ముంబై: వియత్నాంలోని ఫుక్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరణించిన 15 మంది భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలిస్తున్నారు. హో చి మిన్ సిటీ నుంచి వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో వారి మృతదేహాలు సోమవారం సాయంత్రానికి ముంబై చేరుకుంటాయని హనోయిలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. ముంబైకి చేరుకున్న తర్వాత మృతదేహాలను వారి వారి స్వస్థలాలకు పంపేందుకు ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మృతుల్లో అత్యధికంగా తమిళనాడుకు చెందిన 17 మంది ఉండగా, మిగిలిన వారు ఆంధ్రప్రదేశ్ (3), తెలంగాణ, కేరళ రాష్ట్రాల వారని ప్రాథమిక సమాచారం. ఈ ప్రమాదంలో గాయపడి ఫుక్వోక్‌లో చికిత్స పొందుతున్న మరో భారతీయ పౌరుడికి ఆదివారం సాయంత్రం వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. మెరుగైన చికిత్స కోసం అతడిని సోమవారం హో చి మిన్ సిటీలోని ఆసుపత్రికి తరలించారు. అతడి కుటుంబ సభ్యులు కూడా వియత్నాం చేరుకున్నారు.

## నార్వేలో 75,000 ఏళ్ల నాటి జీవ ఆనవాళ్లు

లండన్: నార్వేలో శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలో ఒక అద్భుతమైన చారిత్రక విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 75,000 ఏళ్ల క్రితం, చివరి హిమయుగంలోని ఒక వెచ్చని కాలంలో ఆర్కిటిక్ ప్రాంతం ఎంతటి గొప్ప జీవవైవిధ్యంతో విలసిల్లిందో తెలియజేసే కీలక ఆధారాలను ఒక గుహలో కనుగొన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, ఈ ఆవిష్కరణ యూరోపియన్ ఆర్కిటిక్‌లో ఇప్పటివరకు కనుగొన్న జంతు సమాజాలలో ఇదే అత్యంత పురాతనమైనదిగా రికార్డు సృష్టించింది. ఈ గుహలోని సహజ నిక్షేపాలు సున్నితమైన ఎముకలు, అవక్షేపాలు, జన్యు పదార్థాలను వేల సంవత్సరాలుగా భద్రపరచడం విశేషం. నార్వే ఉత్తర తీరంలో ఉన్న 'ఆర్నే క్యామ్‌గ్రోట్టా' అనే ఈ గుహ 1990లలో ఒక టన్నెల్ నిర్మాణం సమయంలో అనుకోకుండా బయటపడింది. అయితే, దశాబ్దాల పాటు దానిపై ఎవరూ పెద్దగా దృష్టి పెట్టలేదు. 2021-2022 మధ్యకాలంలో శాస్త్రవేత్తలు తవ్వకాలు జరపగా, ఈ అద్భుత ప్రపంచం ఆవిష్కృతమైంది. ఈ గుహలో క్షీరదాలు, పక్షులు, చేపలకు చెందిన మొత్తం 46 విభిన్న జాతుల అవశేషాలను గుర్తించారు. సముద్ర, టండ్రా, మంచినీటి ఆవాసాలు ఒకేచోట కలిసి ఉన్న ఒక సంక్లిష్టమైన తీరప్రాంత పర్యావరణ వ్యవస్థ ఇక్కడ ఉండేదని ఇది సూచిస్తోంది.

## బాలేంద్ర సర్కారుపై జెన్ జీ ఆగ్రహం

**పేదలపై దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్**

ఖట్మండు: నేపాల్‌లో 25 ఏళ్ల రైడ్‌షేరింగ్ డ్రైవర్ గణేశ్ మృతి దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. గత వారం ఖాట్మండులో కస్టమర్ కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులు అతని మోటార్‌సైకిల్‌కు వీల్ లాక్ వేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో ఇప్పటికే ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. కొన్ని నెలల క్రితమే యువత మద్దతుతో భారీ మెజారిటీ గెలుపొందిన బాలేంద్ర షా ప్రభుత్వంపై ఇప్పుడు అదే జెన్‌జీ తరం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మార్పు కోసం నిలిచిన యువతే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరుతూ వీధుల్లోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం వందలాది మంది సింగ్‌దర్బార్ సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 'పేదలపై దౌర్జన్యాలు ఆపండి', 'మానవ హక్కులను గౌరవించండి' వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, నిర్వాసితులకు ఆశ్రయం కల్పించాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్‌కు రష్యా డూమ్స్ డే

టెహ్రాన్: ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా, ఇరాన్ దేశాలు పరస్పరం దాడులకు తెగబడుతున్నాయి. గడిచిన ఆదివారం నాడు ఇరాన్‌లోని తమ మిలటరీ స్థావరాలపై అమెరికా దాడులు జరిపినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా కీలక నిర్ణయం తీసుకుంది. తమ దేశానికి చెందిన అత్యున్నత స్థాయి ఎబ-214శాఖ 'డూమ్స్‌డే' (ప్రళయ) విమానాన్ని టెహ్రాన్‌కు పంపింది. ఈ చర్య ద్వారా ఇరాన్‌కు మాస్కో బహిరంగంగానే తమ అండను ప్రకటించినట్లయింది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి ముగింపుకు రాలేదు. ఇరు దేశాలు చర్చల ద్వారా యుద్ధానికి ముగింపు పలుకుతాయని భావించే లోపే, పరిస్థితులు తిరిగి మొదటికి వచ్చాయి. రెండు దేశాలు పరస్పరం దాడులు జరుపుకుంటున్న ఈ తరుణంలో, రష్యా ఇరాన్‌కు ఒక అత్యాధునిక విమానాన్ని పంపడం అంతర్జాతీయంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌కు అమెరికా నుంచి దాడులు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఈ విమానం ఇరాన్ గగనతలంలో నిరంతరం నిఘా ఉంచుతోంది. అమెరికా యుద్ధ విమానాలు లేదా క్షిపణులు దూసుకొస్తే ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను ముందే అప్రమత్తం చేస్తుంది.ఇన్ని రకాల ప్రత్యేకతలు ఉన్న ఈ విమానం ఇప్పుడు ఇరాన్‌కు చేరుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. దీని రాకతో ఇరాన్‌కు రక్షణ పరంగా మరింత బలం




చేకూరిందనేది వాస్తవం. ఇది సాధారణ విమానం కాదు. ఇందులో అత్యంత సురక్షితమైన ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, ప్రత్యేక డేటా లింక్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సదుపాయాల వల్ల సంక్షోభ సమయాల్లో విమానంలో ప్రయాణిస్తూనే యుద్ధ కార్యకలాపాలను పూర్తిగా పర్యవేక్షించవచ్చు. ఈ కారణంగానే దీనిని రష్యా "ప్రళయ విమానం" అని పిలుస్తుంది. భూమిపై అణు దాడులు సంభవించినప్పుడు దేశ అధ్యక్షుడు, రక్షణ మంత్రి, సైన్యాధిపతులు ఈ విమానంలోకి ఎక్కి ఆకాశం నుంచే యుద్ధ వ్యూహాలను రచించవచ్చు. కాక్‌పిట్ మినహా ఈ విమానానికి ఎలాంటి కిటికీలు ఉండవు. ఇది అణు విస్ఫోటనం వల్ల వచ్చే రేడియేషన్, విద్యుదయస్కాంత తరంగాల నుండి లోపల ఉన్నవారిని రక్షిస్తుంది. అలాగే ఆకాశంలోనే దీనికి ఇంధనం నింపే సదుపాయం ఉండడం వల్ల, వరుసగా కొన్ని రోజుల పాటు ల్యాండ్ అవ్వకుండా గాల్లోనే ప్రయాణించగలదు. అయితే, ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలోనూ ఈ విమానం రష్యాలో చాలాసార్లు ఆకాశంలో ఎగురుతూ కనిపించింది. ప్రస్తుతం రష్యా వద్ద ఇటువంటి విమానాలు ఎన్ని ఉన్నాయి అనే విషయంపై మాత్రం ఎవరికీ స్పష్టమైన సమాచారం లేదు.

# హార్ముజ్‌ను కాపాడుతాం.. పైసలు కట్టండి

**ప్రపంచ దేశాలపై ట్రంప్ 20 శాతం చార్జీ**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం కీలక ప్రకటన చేశారు. హార్ముజ్ జలసంధి గుండా రవాణా అయ్యే ప్రతి సరుకుపై అమెరికా 20% ఛార్జీ వసూలు చేస్తుందని ప్రకటించారు. "ఇప్పటి నుంచి అమెరికాను 'హార్ముజ్ జలసంధి సంరక్షక దేశం'గా పిలుస్తారు. ఈ అత్యంత ఉద్రిక్త ప్రాంతంలో భద్రత, రక్షణ కల్పించే పనికి అయ్యే ఖర్చు మొత్తాన్ని సరుకులపై 20% రేటుతో తిరిగి వసూలు చేస్తాం. ఈ ప్రక్రియ వెంటనే ప్రారంభమవుతుంది" అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు చేశారు. హార్ముజ్ జలసంధి తెరిచే ఉందని, అలాగే కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఇరాన్ నౌకలు దేశంలోకి రావడం, బయటకు వెళ్లడం అడ్డుకునే దిగ్బంధాన్ని అమెరికా మళ్లీ అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. "హార్ముజ్ జలసంధి తెరిచే ఉంది. ఇరాన్ ఉన్నా లేకపోయినా అలాగే ఉంటుంది. ఇరాన్ నౌకలు, ఆ దేశ వినియోగదారుల నౌకల రాకపోకలను మాత్రమే అడ్డుకునే దిగ్బంధాన్ని మళ్లీ అమలు చేస్తున్నాం. మిగతా అన్ని దేశాల నౌకలకు హార్ముజ్ జలసంధి వినియోగంపై ఎలాంటి ఆంక్షలు



ఉండవు" అని ట్రంప్ తెలిపారు. ఈ పోస్టుకు కొన్ని గంటల ముందు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా ట్రంప్ ఇదే అంశంపై మాట్లాడారు. "ఆ జలసంధిని మేమే నియంత్రిస్తాం. దాన్ని నిర్వహించే బాధ్యత కూడా మాదే కావచ్చు. ఆ జలసంధికి సంరక్షకులమవుతాం. దానికి అయ్యే ఖర్చు మాకు తిరిగి రావాలి" అని ట్రంప్ చెప్పారు.ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ ఖాతమ్ అల్-అన్బియా సైనిక కమాండ్ ప్రతినిధి వీడియో సందేశం ద్వారా స్పందించారు. హార్ముజ్ జలసంధి నిర్వహణలో అమెరికా జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ జలమార్గం విషయంలో అమెరికాతో సహకరించే గల్ఫ్ దేశాల చర్యను యుద్ధ చర్యగానే పరిగణిస్తామని హెచ్చరించారు.

# ఏఐ వాడకం అంటే మనదే

**ఏఐ వినియోగంలో భారత్ నం.1.. ప్రపంచంలోనే మన ఉద్యోగులు టాప్**

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో భారత ఉద్యోగులు ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారని ఏడీపీ అనే సంస్థ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 80 శాతం మంది ఉద్యోగులు వారంలో చాలాసార్లు ఏఐని వాడుతుండగా, 41 శాతం మంది ప్రతిరోజూ వినియోగిస్తున్నారని సోమవారం విడుదలైన ఈ రిపోర్ట్ పేర్కొంది. రాబోయే ఏడాదిలో ఏఐ తమ ఉద్యోగ బాధ్యతలపై సానుకూల ప్రభావం చూపుతుందని 31 శాతం మంది ఉద్యోగులు బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రపంచంలోనే అత్యంత ఆశావాద దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. అయితే, ఆసక్తికరంగా ఏఐని తరచుగా వాడే ఉద్యోగులే తమ ఉత్పాదకతపై సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఏఐ వాడని వారితో పోలిస్తే, ఏఐ వాడేవారిలో ఒత్తిడి తక్కువగా ఉన్నప్పటికీ ఈ ధోరణి కనిపించడం గమనార్హం. ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో యువత ముందుంది. 18--39 ఏళ్ల వయసు వారిలో 43 శాతం మంది దాదాపు ప్రతిరోజూ ఏఐని ఉపయోగిస్తున్నారు. అలాగే, పురుషుల (40 శాతం) కంటే మహిళలే (44 శాతం) ఎక్కువగా ఏఐని వాడుతున్నట్టు తేలింది. పెద్ద సంస్థల్లో ఈ వినియోగం మరింత ఎక్కువగా, సుమారు 54 శాతంగా ఉంది. "పనిని సులభతరం చేసే టెక్నాలజీలను స్వీకరించడానికి భారత ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ప్రపంచంలోని ఇతర ఉద్యోగుల కన్నా వేగంగా ఏఐని అందిపుచ్చుకుంటున్నారు" అని ఏడీపీ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఏషియా మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ గోయల్ అన్నారు. కేవలం ఏఐ వాడకాన్ని పెంచడంపైనే కాకుండా, దానిని సమర్థంగా అమలు చేయడం, ఉద్యోగులకు తగిన సాధికారత కల్పించడంపై సంస్థలు దృష్టి పెట్టాలని నివేదిక సూచించింది.





## అయోధ్య ట్రస్ట్ సీఈవో పదవికి

### దరఖాస్తులు ఆహ్వానం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలోని రామ మందిర విరాళాల చోరీ ఆరోపణల వివాదం కొనసాగుతుండగనే శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్రం కీలక పదవికోసం దరఖాస్తులను ఆహ్వానిస్తూ సోమవారం ఎక్స్‌లో ఒక ప్రకటనను పోస్ట్ చేసింది. ఈ ప్రకటన ప్రకారం మూడేళ్ల పదికాలానికిగాను ఆలయ ట్రస్ట్ సీఈవో పదవికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ఇందుకు జూలై 18 చివరి తేదీ అని పేర్కొంది. ఈ పదవి కాలపరిమితి మూడు సంవత్సరాలు. 50 - 70 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు. జీత భత్యాలు పరస్పర చర్చల ద్వారా నిర్ణయించబడతాయని వెల్లడించింది. ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి లేదా సీఈవో నేరుగా ప్రధాన కార్యదర్శికి నివేదిస్తారు. సంస్థ అత్యున్నత కార్యనిర్వాహక అధికారిగా వ్యవహరిస్తూ, దాని చట్టబద్ధమైన, పరిపాలన, ఆర్థిక విధులను పర్యవేక్షిస్తారు. సంస్థ లక్ష్యాలు స్థాయికి తగిన కార్యాచరణ వ్యవస్థలు, విధానాలు, పద్ధతులను అభివృద్ధి చేయాలి. ట్రస్ట్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో సహా, ట్రస్ట్ మొత్తం నిర్వహణకు సీఈవో బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు, అకౌంటింగ్ వ్యవస్థలు, సంస్థాగత సమాచారంలో పారదర్శకత, జవాబు దారీతనం, సామర్థ్యాన్ని ప్రోత్సహించే బాధ్యత సీఈవోకు ఉంటుంది. ఈ బాధ్యతలతోపాటు అవసరమైనప్పుడు స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సంస్థ భద్రతా వ్యవస్థను కూడా సీఈవో పర్యవేక్షిస్తారు. అన్ని మతపర ఆచారాలు, పూజలు, పండుగలు, వేడుకలను సంప్రదాయాలకు అనుగుణంగా జరిగేలా చూసే బాధ్యత ఈ పదవిపై ఉంటుంది. అలాగే ఆలయాన్ని సందర్శించే యాత్రికులు, భక్తుల భద్రత, సౌకర్యాలకు ఎలాంటి లోటు లేకుండా నిర్ధారించడం మరో ముఖ్య బాధ్యతల్లో ఒకటి. ఇంకా సంస్థను సందర్శించే విశిష్ట అతిథులు, ప్రముఖ సాధువుల కోసం ఏర్పాట్లు చూడాలి. ట్రస్ట్, ఆలయం రెండింటి ప్రతిష్టను పెంచడానికి కృషి చేయాలి. ట్రస్ట్ డీడ్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సీఈవో ప్రణాళికలను రూపొందించి, బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు, జనరల్ సెక్రటరీ మార్గదర్శకత్వంలో నిర్వర్తించాలి. ట్రస్ట్ లేదా ప్రధాన కార్యదర్శి ఎప్పటికప్పుడు అప్పగించే అదనపు బాధ్యతలను కూడా సీఈవో నిర్వహించాలి.



## జగిత్యాలలో చిన్నారులకు నట్టల మందు పంపిణీ

జగిత్యాల టౌన్, జూలై 13 (ఈవార్తలు): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో గల ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నులిపురుగులు పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, రక్తహీనత, పోషకాహార లోపానికి దారితీసే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించి ప్రతి చిన్నారికి తప్పనిసరిగా మాత్రలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనమాల గంగాధర్, రజనీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రాజన్న గుడి అభివృద్ధికి రూ.54 వేల విరాళం

వేములవాడ అర్బన్, జూలై 13 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల కోసం అమెరికాలో నివసిస్తున్న హనుమకొండకు చెందిన చామల చందన--వివేకానంద్ కుటుంబ సభ్యులు రూ.54 వేల విరాళాన్ని అందజేశారు. దాతల తరఫున అందించిన విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వీకరించి, ఆలయ అభివృద్ధికి సహకరించిన కుటుంబ సభ్యులకు దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చామల చందన--వివేకానంద్ కుటుంబ సభ్యులు శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం, తీర్థ ప్రసాదం అందించి ఆశీర్వదించారు.



## రాజన్న గుడిలో బదిలీ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

వేములవాడ అర్బన్, జూలై 13 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో గత రెండేళ్లుగా సేవలందించిన బదిలీ ఉద్యోగులకు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. దేవస్థానంలోని శ్రీ భీమేశ్వర సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి బదిలీపై వేములవాడకు వచ్చిన మొత్తం 14 మంది ఉద్యోగులను దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి అధికారికంగా రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించి దేవస్థానం అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ భీమేశ్వర స్వామివారి సేవలో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరికీ దక్కిన అదృష్టమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు ఎక్కడ పనిచేసినా స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఉద్యోగులకు స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందజేసి ఘనంగా సత్కరించారు. సహోద్యోగులతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పలువురు భావోద్వేగానికి గురయ్యారు. ఆనందం, వీడ్కోలు బాధల మధ్య కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈవో నవీన్ కుమార్, ఈఈ రాజేష్, ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు పాల్గొని బదిలీ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. వేములవాడ దేవస్థానంలో సేవలందించిన ఉద్యోగులు తమ క్రమశిక్షణ, సేవాభావంతో ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అధికారులు అభినందించారు.

## రౌడీషీటర్ల తాట తీస్తాం

### కోరుట్ల పోలీసుల కఠిన హెచ్చరిక

కోరుట్ల, జూలై 13 (ఈవార్తలు): కోరుట్ల సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, గతంలో పోక్సో కేసుల్లో నిందితులుగా ఉన్న వారితో కోరుట్ల సీఐ కె. లక్ష్మీనారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎస్ఐ ఎం. చిరంజీవి, మేడిపల్లి ఎస్ఐ శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్ఐ రవికిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, సర్కిల్ పరిధిలో గుండాయిజం, రౌడీయిజం, మహిళలపై వేధింపులు, భూ, డబ్బు వివాదాలు, బెదిరింపులు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు, రియల్టర్లను బెదిరించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, పోక్సో నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.



## రహదారులు.. వానరాల స్థావరాలు

### మామిడిపల్లిలో కోతుల బీభత్సం.. వందల సంఖ్యలో సంచరిస్తున్న కోతులు

వేములవాడ అర్బన్/కోనరావుపేట, జూలై 13 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. వందల సంఖ్యలో సంచరిస్తున్న కోతులు గ్రామంలోని రోడ్లపై, ఇళ్ల పరిసరాల్లో స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇంటి సామగ్రిని ధ్వంసం చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలోని రాములవారి ఆలయం వద్ద కోతులు అధికంగా సంచరిస్తూ భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కోతుల భయంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావడానికి సైతం వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో కోతులు ప్రజలపై దూకేందుకు ప్రయత్నించడంతో గ్రామ-స్థుల్లో ఆందోళన మరింత పెరిగిందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతులను పట్టుకుని సమీప అటవీ ప్రాంతాలకు తరలించాలని గ్రామస్థులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు. గ్రామంలో నెలకొన్న కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెండేళ్లలో 60 వేల కేసుల పరిష్కారం

### ఎన్సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానా




హైదరాబాద్, జూలై 13 (పీఐబీ): జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్సీఎస్సీ) గత రెండేళ్లలో దేశవ్యాప్తంగా 60 వేలకుపైగా కేసులను పరిష్కరించి చరిత్ర సృష్టించిందని ఎన్సీఎస్సీ చైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. సోమవారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఆధునికీకరించిన ఎన్సీఎస్సీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అణగారిన వర్గాలకు న్యాయం అందించడం, వారి రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం కోసం కమిషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాజ్యాంగంలోని 338వ అధికరణ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదుదారునికి సకాలంలో న్యాయం అందించాలనే లక్ష్యంతో కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. ఎన్సీఎస్సీ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ, కమిషన్‌కు చట్టపరంగా నోటీసులు, సమన్లు జారీ చేసే పూర్తి అధికారాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించేందుకు, ఎంఎస్ఎంఈ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎన్సీఎస్సీ కార్యదర్శి గుడే శ్రీనివాస్ మాట్లాడుతూ, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించేందుకు ఆధునిక డిజిటల్ వ్యవస్థలను వినియోగిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అసలైన లబ్ధిదారులకు చట్టబద్ధ రక్షణ, సంక్షేమ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్సీఎస్సీ రాష్ట్ర కార్యాలయ డైరెక్టర్ డాక్టర్ జీ. సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ, 2024--26 మధ్య హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం 10,853 ఫిర్యాదులను పరిష్కరించి దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన కార్యాలయాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) చట్టం కింద బాధితులకు రూ.33.80 కోట్ల పరిహారం అందించడంతో పాటు 177 సుమోటో కేసులు నమోదు చేసి, 127 చట్టబద్ధ విచారణలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్సీఎస్సీ సభ్యులు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంగాధర పీఎస్‌లో సీఎం రేవంత్‌పై ఫిర్యాదు

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, జూలై 13 (ఈవార్తలు): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు, బీఆర్ఎస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉండటమే కాకుండా ప్రజలను రెచ్చగొట్టేలా, ఆత్మహత్యలకు ప్రేరేపించేలా ఉన్నాయని ఆరోపిస్తూ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 11న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, కన్నెపల్లి పంపుల ద్వారా నీటిని విడుదల చేయబోమని పేర్కొనడమే కాకుండా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు రైతుల పొలాల్లో రక్తం చల్లితే పంటలు పండుతాయంటూ వ్యాఖ్యానించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. అలాగే నీళ్లు అడిగేవారు కన్నెపల్లి వద్ద బండ కట్టుకుని దూకాలని అన్నట్లుగా మాట్లాడటం ముఖ్యమంత్రి స్థాయికి ఏమాత్రం తగదని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలను రెచ్చగొట్టేలా, ఆత్మహత్యలకు ప్రేరేపించేలా ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేసే అవకాశం ఉన్నప్పటికీ కావాలనే నీటిని నిలిపివేస్తోందని ఆరోపించారు. రైతుల కోసం అవసరమైతే తమ రక్తాన్ని సైతం ఇవ్వడానికి బీఆర్ఎస్ నాయకులు సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ రైతాంగాన్ని కాపాడేందుకు చివరి వరకు పోరాడతామని సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వేములవాడలో శైవాగమ శిక్షణ ప్రారంభం



వేములవాడ, జూలై 13 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ నిర్వహిస్తున్న మూడు రోజుల "దేవాలయ సంస్కృతి -- శైవాగమం -- పరిపాలన" శిక్షణ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. జూలై 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ాxూా డైరెక్టర్ డా. చిలకపాటి విజయ రాఘవాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పరిపాలనలో నియమ నిబంధనలు, ఉద్యోగుల బాధ్యతలు, క్రమశిక్షణ, శైవాగమ శాస్త్రాల ప్రాముఖ్యత, పూజా విధానాలు, దేవాలయ నిర్వహణలో పాటించాల్సిన ప్రమాణాలపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో 15 ఏళ్లకు పైగా పనిచేసిన అనుభవాలను కూడా ఉద్యోగులతో పంచుకున్నారు. తొలి రోజు ఉదయం శ్రీశైలం దేవస్థానానికి చెందిన కె.వి. సత్య బ్రహ్మాచార్యులు "టెంపుల్ కల్చర్ -- శైవాగమం" అంశంపై శిక్షణ ఇవ్వగా, మధ్యాహ్నం స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రధాన స్థపతి డి.ఎన్.వి. ప్రసాద్ స్థపతి ఆలయ శిల్పకళ, గర్భగృహ నిర్మాణ విశిష్టత, భారతీయ దేవాలయ వాస్తు సంప్రదాయాలపై వివరించారు. శిక్షణలో ఆలయ సంస్కృతి, శైవాగమాలు, ఉద్యోగుల నియమ నిబంధనలు, దేవాదాయ శాఖ మాన్యువల్, క్రమశిక్షణ చర్యలు, దేవాలయ పూజా విశిష్టత, సోషల్ ఆడిట్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి మాట్లాడుతూ, ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉద్యోగుల్లో సేవాభావం, బాధ్యతాయుతమైన పరిపాలనా నైపుణ్యాలను పెంపొందించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ, డిప్యూటీ ఈవో నవీన్ కుమార్, ఈఈ రాజేష్, ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్నారు.

## సీఎం రేవంత్‌పై కేసు పెట్టాలి

### మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

### జగిత్యాలలో బీఆర్ఎస్ మెరుపు ధర్నా

జగిత్యాల టౌన్, జూలై 13 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జగిత్యాలలో మెరుపు ధర్నా నిర్వహించారు. జీవన్ రెడ్డి నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఓల్డ్ బస్టాండ్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి సీఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేసి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నీరు అందించాలన్న విజ్ఞప్తులకు స్పందించకుండా, హింసను ప్రేరేపించేలా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు. పోలీస్ స్టేషన్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి వచ్చినప్పటికీ అధికారులు అందుబాటులో లేకపోవడంతోనే రోడ్డుపైకి రావాల్సి వచ్చిందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చట్ట ప్రకారం ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా వెంటనే సాగు, తాగునీటిని విడుదల చేయాలని కూడా జీవన్ రెడ్డి కోరారు. జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్ దావా వసంత మాట్లాడుతూ, ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి హింసను ప్రేరేపించేలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. రైతులకు నీరు అందించాల్సిన ప్రభుత్వం బెదిరింపు వ్యాఖ్యలు చేయడం ఖండనీయమని, సీఎం రేవంత్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానం

వేములవాడ, జూలై 13 (ఈవార్తలు): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య ఘనంగా సన్మానించారు. సోమవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు డా. కొండ దేవయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్నూరు కాపు సత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. కొండ దేవయ్య ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, వేములవాడ ప్రెస్‌క్లబ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, ప్రెస్‌క్లబ్ గౌరవ సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి కముటాల విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక శ్రీధర్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, చేకూర్తి నవీన్, షబ్బీర్, ఆసీమ్ తదితరులు పాల్గొన్నారు.

## నవజీవన్ నగర్‌లో వైభవంగా మాస శివరాత్రి

కూకట్‌పల్లి, జూలై 13 (ఈవార్తలు): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసాపేట సర్కిల్, బాలానగర్ డివిజన్‌లోని నవజీవన్ నగర్ శ్రీ శ్రీ లక్ష్మీ విజయ గణపతి సహిత ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి, చతుర్దశి సోమవారం, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాలంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పరమేశ్వరునికి విశేష శివారాధన, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధభరిత పుష్పాలతో స్వామివారిని అలంకరించగా, దివ్య అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయం భక్తులతో కిక్కిరిసిపోగా, "ఓం నమః శివాయ" నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాస శివరాత్రి, ప్రదోష పూజల విశిష్టతను వివరించారు. భక్తిశ్రద్ధలతో శివారాధన చేసిన వారికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని తెలిపారు. శివునికి అన్నాభిషేకం చేయడం అత్యంత పుణ్యప్రదమైన సేవగా భావిస్తారని, దీనివల్ల దైవానుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ఈవార్తలు
వినోదవాణి
CINEMA
మంగళవారం 14-7-2026, జగిత్యాల 

## వయ్యారి చిత్రం




# దేవుడిగా రాజేంద్రప్రసాద్, భక్తుడిగా శ్రీకాంత్

## ఇంట్రెస్టింగ్‌గా 'మిస్టర్ మిడిల్ క్లాస్' ట్రైలర్

సీనియర్ నటులు శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'మిస్టర్ మిడిల్ క్లాస్'. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. కామెడీ, ఎమోషన్, భక్తి అంశాల కలబోతగా ఉన్న ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రం జూలై 17న థియేటర్లలో విడుదల కానుంది. వివరాల్లోకి వెళితే, ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్




వెంకటేశ్వర స్వామి పాత్రలో కనిపించనుండగా, ఆయన భక్తుడిగా శ్రీకాంత్ నటిస్తున్నారు. ఒక మధ్యతరగతి వ్యక్తికి అనూహ్యంగా సంపద వస్తే అతని జీవితంలో ఎలాంటి మార్పులు, సవాళ్లు ఎదురయ్యాయి అనే కథాంశంతో ఈ సినిమాను రూపొందించారు. కామెడీతో పాటు ఎమోషనల్, థ్రిల్లర్ సన్నివేశాలు కూడా ఉంటాయని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. గతంలో పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్ మళ్లీ తెరపై సందడి చేయనుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లయ కథానాయికగా నటించారు. బాలు జె క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. సునీల్, అలీ, వెన్నెల కిశోర్, పృధ్వీరాజ్, ధన్‌రాజ్ వంటి ప్రముఖ హాస్యనటులు కీలక పాత్రలు పోషించగా, సాయికార్తీక్ సంగీతం అందించారు. తాజాగా, ఈ చిత్రం ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. మధ్యతరగతి కుటుంబం యొక్క కలలు, కష్టాల నేపథ్యంలో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రాబోతోంది.

# శేఖర్ మాస్టర్‌తో విబేధాలు లేవు



ఫిల్మ్ డ్యాన్సర్ అసోసియేషన్‌కు సంబంధించి శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అసోసియేషన్ ఎన్నికలు, సభ్యత్వాల విషయంలో ఇరు వర్గాల మధ్య విభేదాలు వచ్చాయని.. సభ్యుల సంక్షేమం, అంతర్గత నిర్ణయాల విషయంలో రెండు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో తాజాగా జానీ మాస్టర్ స్పందించాడు. శేఖర్ మాస్టర్‌తో తనకు ఎలాంటి విబేధాలు లేవని జానీ మాస్టర్ స్పష్టం చేశాడు. తాము కొట్టుకున్నామని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నాడు. శేఖర్ మాస్టర్ నాకు సోదరుడి లాంటి వారు. చిరంజీవి దగ్గరకు వెళ్లి కలిసి భోజనం చేశాం. చిరంజీవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మా మధ్య ఉన్నది చిన్న చిన్న విభేదాలే.. అన్నీ కుటుంబంలో వచ్చే సమస్యలు లాంటివని చెప్పాడు.

# సల్మాన్ 'మాతృభూమి' వాయిదా?




బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్, చిత్రాంగద సింగ్ జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మాతృభూమి'. దర్శకుడు అపూర్వ లఖియా దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో, సల్మాన్ ఖాన్ కల్నల్ సంతోష్ బాబు పాత్రను పోషిస్తున్నారు. అయితే ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు మొదట 'బాటిల్ ఆఫ్ గాల్వన్' అని టైటిల్ పెట్టినప్పటికీ వివాదాలకు తావివ్వకుండా ఎలాంటి దేశం పేరు ప్రస్తావించకుండా 'మాతృభూమి'గా మార్చారు మూవీ మేకర్స్. అయితే ఈ సినిమా సెన్సార్ బోర్డు క్లియరెన్స్ సమస్యల కారణంగా విడుదల వాయిదా పడుతూ వస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్నప్పటికీ పలు కారణాలతో నిత్యం వాయిదా పడుతూ వస్తుండటంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, 'మాతృభూమి' విడుదలపై క్రేజీ అప్డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా విడుదల అనుకున్న సమయానికి కాకుండా, ఏకంగా 2027వ సంవత్సరానికి వాయిదా పడినట్లు తెలుస్తోంది.

# సమంత కోసం కథలు క్యూ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత 'మా ఇంటి బంగారం' సినిమాతో మరోసారి తన స్టామినా నిరూపించుకుంది. సమంతకు స్టార్ హీరోల స్థాయిలో క్రేజ్ ఉందని మా ఇంటి బంగారం సినిమా వసూళ్లతో నిరూపితం అయ్యింది. విడుదలైన మూడు వారాల్లో సమంత బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.100 కోట్ల వసూళ్లు నమోదు చేసింది. పోటీగా సినిమాలు ఉన్నప్పటికీ, పెద్ది వంటి సినిమా థియేటర్ లలో ఆడుతున్నప్పటికీ మా ఇంటి బంగారం సినిమాను జనాలు ఎగబడి మరీ చూశారు. సమంత బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఆమె నుంచి రాబోతున్న కొత్త సినిమాల గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సమంత ప్రెగ్నెంట్ అనే విషయం తెల్సిందే. ఇప్పటికే ఆమె తన బేబీ బంప్ ఫోటోలను రివీల్ చేసింది. ఈ ఏడాదిలోనే సమంత తల్లి కాబోతున్నట్లు ఆమె సన్నిహితులు చెప్పుకొచ్చారు. సాధారణంగా ఏ హీరోయిన్ అయినా ప్రెగ్నెంట్ అయితే కనీసం ఏడాది పాటు బ్రేక్ తీసుకునే అవకాశం ఉంటుంది. అంటే సమంత సైతం ఏడాది బ్రేక్ తీసుకుని తర్వాత సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది కాలంలో సమంత ఖాళీగా ఉండకుండా తప్పకుండా మంచి సినిమా కథల కోసం వెతికే అవకాశాలు ఉంటాయి. మా ఇంటి బంగారం సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది కనుక మళ్లీ అలాంటి కథలు సమంతను వెతుక్కుంటూ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే దర్శకులు, రచయితలు సమంత కోసం అలాంటి లేడీ ఓరియంటెడ్ యాక్షన్ సీన్స్ ఉండే కథలను రెడీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.





# 18న ఎన్టీఆర్ ప్రకటన ఏంటంటే..!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ రాజకీయాల్లో రాబోతున్నారని గత కొద్ది రోజులుగా పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. ముఖ్యంగా జూలై 18న తారక్ కీలక ప్రకటన విడుదల చేయనున్నారని.. అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాజకీయ ప్రయాణాన్ని మొదలు పెట్టబోతున్నట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ అధికారిక బృందం స్పందిస్తూ ఒక నోట్ విడుదల చేసింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెబుతూ ఆ పుకార్లకు పూర్తిగా చెక్ పెట్టింది. జూలై 18న ఎన్టీఆర్ రాజకీయ ప్రకటన ఉంటుందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు తమ దృష్టికి వచ్చాయని తారక్ టీమ్ పేర్కొంది. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమేనని, దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని వారు స్పష్టం చేశారు.


# భాగ్యశ్రీకి ఆఫర్లే ఆఫర్లు!

టాలీవుడ్‌లో భాగ్యశ్రీ బోర్సే ఎట్టకేలకు హిట్ కొట్టింది. 2024లో రవితేజతో కలిసి 'మిస్టర్ బచ్చన్' సినిమాలో నటించడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన భాగ్యశ్రీ బోర్సే అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమాతోనే అందంతో మెప్పించిన ఈ అమ్మడు హిట్ మాత్రం కొట్టలేకపోయింది. మిస్టర్ బచ్చన్‌లో ఈమె పాత్ర పై విమర్శలు సైతం వచ్చాయి. టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారే అందం, ఫీచర్స్ భాగ్యశ్రీలో మెండుగా ఉన్నాయంటూ ఆ సమయంలోనే చాలా మంది కామెంట్స్ చేశారు. మొదటి సినిమా నిరాశ పరిచినప్పటికీ లక్కీగా ఈ అమ్మడికి విజయ్ దేవరకొండతో కలిసి కింగ్డమ్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా సైతం తీవ్రంగా నిరాశను మిగిల్చింది.



# ప్రభాస్‌తో నటించాలనుంది

ఫోక్ డాన్సర్ నాగ దుర్గ తన అభిమాన హీరో గురించి మనసు విప్పింది. "నాకు ప్రభాస్ అంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే ఎగిరి గంతేసి ఒప్పుకుంటాను" అని చెప్పింది. ప్రస్తుతం నాగ దుర్గ 'ఇదుపు కాయితం' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. టాలెంటెడ్ నటుడు



ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు జీఏ2 పిక్చర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బన్నీ వాసు, సుకుమార్ సంయుక్తంగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది.



# జాంబీ కామెడీలో శనయా

ఇటీవల 'తూ యా మై' సినిమాతో ప్రేక్షకులకు మంచి థ్రిల్‌ని పంచింది బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ కపూర్ కుమార్తె, హీరోయిన్ శనయా కపూర్. ఇప్పుడామే తన నెక్స్ట్ సినిమా కోసం హీరో టైగర్ ష్రాఫ్‌తో చేతులు కలిపినట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బాలీవుడ్ నిర్మాత ఫిరోజ్ ఎ. నడియాడ్‌వాలా.. టైగర్, శనయాల కాంబోలో ఓ జాంబీ కామెడీని రూపొందించే ప్రయత్నంలో ఉన్నటుల తెలుస్తుండగా.. దీనికి అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే డైరెక్టర్ అహ్మద్ ఖాన్, టైగర్ ష్రాఫ్ కాంబోలో వచ్చిన 'భాఘీ 3, హీరోపంతీ 2' హిట్ అందుకోగా.. ఇప్పుడు ఇది మూడో ప్రాజెక్టుగా రాబోతున్నది. తాజాగా జాంబీ సినిమాకు సంబంధించిన ఇంట్రెస్టింగ్ అప్డేట్ పంచుకున్నాడు డైరెక్టర్. ఈ సినిమాను అఫీషియల్‌గా ఓకే చేస్తూ.. 'అవును, ఆ సినిమా పనులు జరుగుతున్నాయి. ఇది ఖచ్చితంగా తెరకెక్కబోతుంది.. మేము ఇప్పటికే ఫోటోషూట్ పూర్తి చేశాము. మిగిలిన నటీనటులను ఖరారు చేయడం మాత్రమే ఇక మిగిలి ఉంది. ఇది పలువురు ప్రముఖ నటులతో కూడిన 'మల్టీ-స్టారర్' చిత్రం కానుంది. దీని నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి' అని ఆయన తెలిపారు.




## సీఎస్కే కొత్త కోచ్ రేసులో

# ధోనీ, అశ్విన్!

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తమ జట్టుతో 18 ఏళ్లుగా హెడ్ కోచ్‌గా కొనసాగుతున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఫ్లెమింగ్ కోచింగ్‌లో సీఎస్కే ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఎంఎస్ ధోనీతో అతనికి ఉన్న అవినాభావ సంబంధం జట్టు విజయాలకు మూలస్తంభంగా నిలిచింది. అయితే, గత మూడేళ్లుగా సీఎస్కే ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆధునిక టీ20 ఫార్మాట్‌లో అవసరమైన కొత్త వ్యూహాలు, ఆలోచనలు ఫ్లెమింగ్ వద్ద కొరవడ్డాయని, అందుకే జట్టు ప్రక్షాళనలో భాగంగా ఈ మార్పు చేపట్టినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్లెమింగ్ నిష్క్రమణతో అతని స్థానాన్ని భర్తీ చేసే కొత్త కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. పలువురు దిగ్గజాలు, యువ కోచ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కొత్త కోచ్ రేసులో ధోనీ, ద్రవిడ్, అశ్విన్, దినేశ్ కార్తీక్, హేమంగ్ బదానీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## టీమిండియాతో తొలి మ్యాచ్‌కు

# ఇంగ్లండ్ జట్టు ప్రకటన

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతూ ఇంగ్లండ్ యాజమాన్యం ఆశ్చర్యకర నిర్ణయం తీసుకుంది. సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ వికెట్ కీపర్-బ్యాటర్ జోస్ బట్లర్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం కానుంది. అతను తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. ఇంగ్లండ్ వైట్-బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఉన్న బట్లర్, 2012 ఫిబ్రవరి 21న దుబాయ్‌లో పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన 199 మ్యాచ్‌లలో 39.11 సగటుతో 5,515 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతను ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 21 వన్డేలు ఆడిన యువ డైనమిక్ ప్లేయర్ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేయడం వెనుక బలమైన కారణమే ఉంది. బెన్ డకెట్‌కు సరైన భాగస్వామిని కనుగొనాలనే ఇంగ్లండ్ ప్రయత్నాలు దీని ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ తర్వాత డకెట్‌కు ఐదో ఓపెనింగ్ భాగస్వామిగా బెథెల్ నిలవనున్నాడు. ఇది ఓపెనింగ్ స్థానంపై ఇంగ్లండ్ జట్టులో నెలకొన్న అస్థిరతను




సూచిస్తోంది. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి బలమైన భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లతో దాడి చేయాలని నిర్ణయించుకుంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ మోయనున్నారు. ఇటీవల టీ20 సిరీస్‌లో అదరగొట్టిన ఆర్చర్, గతేడాది నవంబర్ తర్వాత తొలిసారిగా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. దీంతో గస్ అట్కిన్‌సన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఇరు జట్లు జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న లార్డ్స్‌లో మూడో వన్డేలో తలపడనున్నాయి.

**తొలి వన్డేకు ఇంగ్లండ్ తుది జట్టు:**

జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.




# భారత మహిళదే లార్డ్స్




## భారత అమ్మాయిల చరిత్రాత్మక విజయం

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు.

**తొలి ఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్‌లా మారిన పేసర్ క్రాంతి గౌడ్ నిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.**

ఇంగ్లండ్ గడ్డపై భారత పురుషుల జట్టుకు చెంపపెట్టులాంటి విజయం సాధించారు అమ్మాయిలు. పేలవమైన ఆటతో టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రేయాస్ అయ్యర్ సేనకు.. ఇంగ్లండ్‌ను ఇలా ఓడించాలి అని చాటిచెప్పింది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం. లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో యువ పేసర్ క్రాంతి గౌడ్(2-54) విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడిచారు. బ్యాటుతో మెరిసిన స్మృతి మంధాన(70), యస్తికా భాటియా(113)లు చిరస్మరణీయ విజయంలో కీలకమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తేలిపోయిన ఆతిథ్య జట్టు పొట్టి వరల్డ్‌కప్ ఓడిన చోటే.. ఏకైక టెస్టులోనూ చతికిలపడింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 341-7 వద్ద డిక్లేర్ చేశాక.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2-54).. సయాలీ సత్ఘరే(2-24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్(0), హీథర్ నైట్(13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్‌లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం మరింత సలువైంది. ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ చూస్తుండగానే కుప్పకూలింది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా(4-42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్‌స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్డ్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్డ్ చేయగా.. క్రీజునంటుకున్న ఎకిల్‌స్టోన్‌ను రాణా ఔట్ చేసి తరాతరాలు చెప్పుకోదగగిన విజయంలో భాగమైంది. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83), హర్మన్‌ప్రీత్ కౌర్(58)లు అర్ధ శతకాలతో పటిష్టమైన పునాది వేసినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్ స్పిన్నర్ మ్యాడీ విల్లియర్స్(2-79) ధాటికి మిడిలార్డర్ వైఫలమైంది. ఓవైపు వికట్లు పడుతున్నా బాధ్యతగా ఆడిన దీప్తి శర్మ(57) టెయిలెండర్లతో కలిసి పోరాడి స్కోర్ 280 దాటించింది. కానీ, ఒకే ఓవర్లో దీప్తిని, క్రాంతి గౌడ్‌ను ఔట్ చేసిన సోఫీ ఎకిల్‌స్టోన్(3-68) భారత ఇన్నింగ్స్‌కు తెరదించింది.

## అందమైన ముందడుగు: సచిన్

లార్డ్స్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా మహిళల క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా జరిగిన మహిళల టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సేన గెలవడం ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించాడు. మహిళల క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ చివరి రోజున సచిన్ స్వయంగా మైదానంలో ఉండి విజయాన్ని వీక్షించాడు. ఆట ప్రారంభానికి ముందు సచిన్ భారత మహిళా క్రికెటర్లతో మాట్లాడాడు. ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన అనంతరం, సచిన్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నాడు. "ప్రతి క్రికెటర్‌కు లార్డ్స్‌లో ఆడాలనే కల ఉంటుంది. గత నాలుగు రోజులుగా, తొలిసారిగా ఇక్కడ మహిళల టెస్ట్ క్రికెట్ జరగడంతో కొత్త తరం క్రీడాకారిణులు ఆ కలను సాకారం చేసుకున్నారు" అని సచిన్ పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన సచిన్, కీలక క్రీడాకారిణుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. "వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నిలకడ, యాస్తిక భాటియా అద్భుతమైన సెంచరీ, పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల ప్రదర్శన ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అని కొనియాడాడు.

## లెస్బియన్ క్రికెట్ దంపతుల గోల!

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టులో సీనియరైన అష్లే గార్డ్‌నర్ వివాదంలో ఇరుక్కుంది. మరో మహిళను పెళ్లి చేసుకున్న ఈ ఆల్‌రౌండర్ ఇప్పుడు మరొకరితో ప్రేమాయణం సాగిస్తుందనే



వార్త వైరలవుతోంది. గార్డ్‌నర్‌పై ఈ ఆరోపణలు చేసింది ఆమె భార్య మోనికా రైట్ కావడం గమనార్హం. మోనికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న ఈ అఫైర్ విషయం డెయిలీ మెయిల్ వార్త సంస్థలో ప్రచురితమైంది. గార్డ్‌నర్ అఫైర్‌పై భగ్గుమన్న మోనికా.. ఆస్ట్రేలియా క్రికెటర్ జార్జియా వోల్ ఫొటోను షేర్ చేస్తూ.. 'ఈవిడే మా కాపురాన్ని నాశనం చేసింది' అని వెల్లడించింది. అన్యోన్యంగా ఉండే తమ మధ్య దూరం పెరగడానికి కారణం భారత పర్యటనే అంటోంది మోనికా. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ కోసం గార్డ్‌నర్‌తో పాటు ఆమె భార్య మోనికా కూడా వచ్చింది. అయితే.. టోర్నీ సమయంలోనే గార్డ్‌నర్ ప్రవర్తనలో తేడాను గమనించింది మోనిక. స్వదేశం వచ్చాక ఇదే విషయంపై తన భాగస్వామిని ఆమె ప్రశ్నించింది. అప్పుడు.. గార్డ్‌నర్ మన మధ్యలో ఏదో మార్పు వచ్చింది. ఇక కలిసి ఉండడం కుదరదు అని తేల్చి చెప్పింది. అక్కడితో వీరి పెళ్లి పెటాకులైంది. నిరుడు నవంబర్‌లోనే ఆసీస్ ఆల్‌రౌండర్ సిడ్నీలో తాము కలిసి ఉంటున్న ఇంటిని వీడింది. వెళ్తూ వెళ్తే తమ పెళ్లి ఉంగరాలను అక్కడే వదిలేసిందని డెయిలీ మెయిల్ కథనం పేర్కొంది. ఐదేళ్లు ప్రేమలో మునిగితేలిన గార్డ్‌నర్, మోనికలు 2025 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. ఏడాది పూర్తికాగానే వీరి మధ్య మనస్పర్థలు.. పరాయి ఆకర్షణలు పెరగడంతో వీరి బంధం ముగిసింది.

## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' నామినేషన్లలో గిల్

జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2-1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.



నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# హైదరాబాద్ నీటి నిర్వహణేది?

ఒకప్పుడు చెరువుల నగరంగా పేరొందిన హైదరాబాద్, నేడు నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడే మహానగరంగా మారుతోంది. వర్షాకాలంలో భారీ వర్షాలు, వేసవిలో తీవ్రమైన నీటి కొరత -- ఈ రెండు విరుద్ధ పరిస్థితులు నగర నీటి నిర్వహణలో ఉన్న లోపాలను స్పష్టంగా చూపిస్తున్నాయి. ప్రతి ఏడాది వేసవి ప్రారంభమవుతుందంటే చాలు, అనేక కాలనీల్లో తాగునీటి సరఫరా తగ్గిపోవడం, బోర్లు ఎండిపోవడం, ప్రైవేట్ ట్యాంకర్ల కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూడటం ఒక సాధారణ దృశ్యంగా మారింది. ప్రశ్న ఒక్కటే – ఇది కేవలం ప్రకృతి వైపరీత్యమా? లేక నగర నీటి నిర్వహణలో ఉన్న వైఫల్యాల ఫలితమా? హైదరాబాద్ గత రెండు దశాబ్దాల్లో విపరీతంగా విస్తరించింది. కొత్త కాలనీలు, ఐటీ కారిడార్లు, భారీ అపార్ట్‌మెంట్లు, పారిశ్రామిక ప్రాంతాలు వేగంగా పెరిగాయి. జనాభా పెరిగింది. తాగునీటి అవసరం కూడా అనేక రెట్లు అధికమైంది. కానీ అదే వేగంతో నీటి వనరుల అభివృద్ధి, పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నగర విస్తరణకు అనుగుణంగా నీటి నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయకపోతే ఇలాంటి సంక్షోభాలు పునరావృతం కావడం సహజం. హైదరాబాద్‌కు ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాలే ఆధారం. నగరానికి వందల కిలోమీటర్ల దూరం నుంచి నీటిని పంపింగ్ చేసి సరఫరా చేయాల్సి వస్తోంది. ఈ విధానం భారీ వ్యయంతో కూడుకున్నది. అదే సమయంలో నగరంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురవడం, వాగులు కుంచించుకుపోవడం, సహజ జలమార్గాలు కనుమరుగవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోయాయి. ఫలితంగా భూగర్భ జలాల మట్టం క్రమంగా పడిపోతోంది. ఒకవైపు వరదలు, మరోవైపు నీటి కొరత అనే విరుద్ధ పరిస్థితికి ఇదే ప్రధాన కారణం. వాతావరణ మార్పులు కూడా పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రభావాల కారణంగా వర్షపాతం అస్థిరంగా మారుతోంది. కొద్ది రోజుల్లోనే అధిక వర్షపాతం కురవడం, తర్వాత దీర్ఘకాలం వర్షాలు లేకపోవడం వల్ల నీటి నిల్వలు సక్రమంగా నిర్వహించడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో నగర నీటి నిర్వహణ సంప్రదాయ పద్ధతులతో సాధ్యం కాదు. శాస్త్రీయ ప్రణాళికలు, ముందస్తు అంచనాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పనిచేసే వ్యవస్థలు అవసరం. నీటి కొరతకు మరో ముఖ్య కారణం పంపిణీ వ్యవస్థలో జరిగే నష్టాలు. పాత పైప్‌లైన్లు, లీకేజీలు, అక్రమ కనెక్షన్లు, అనధికారిక వినియోగం కారణంగా సరఫరా అయ్యే నీటిలో గణనీయమైన భాగం వృథా అవుతోంది. ప్రపంచంలోని అనేక మహానగరాలు ఈ సమస్యను స్మార్ట్ మీటర్లు, డిజిటల్ మానిటరింగ్, ప్రెషర్ మేనేజ్‌మెంట్ వంటి సాంకేతిక పరిష్కారాలతో తగ్గిస్తున్నాయి. హైదరాబాద్ కూడా ఈ దిశగా మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. నగరంలో ప్రైవేట్ ట్యాంకర్లపై పెరుగుతున్న ఆధారపడటం కూడా ఆందోళనకరమే. నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ ధరలు ఒక్కసారిగా పెరగడం, సాధారణ కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం మోపుతోంది. నీరు ఒక ప్రాథమిక అవసరం. అది వ్యాపార అవకాశంగా మారే పరిస్థితి రాకూడదు. ప్రభుత్వ నీటి సరఫరా వ్యవస్థ అందరికీ సమానంగా, విశ్వసనీయంగా అందుబాటులో ఉండాలి. పరిష్కారాలు కూడా అందుబాటులోనే ఉన్నాయి. ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను తప్పనిసరిగా అమలు చేయాలి. అమలులో ఉన్న నిబంధనలను కఠినంగా పర్యవేక్షించాలి. చెరువులు, కుంటలు, వాగులను ఆక్రమణల నుంచి రక్షించి పునరుద్ధరించాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పారిశ్రామిక అవసరాలకు, ఉద్యానవనాలకు, నిర్మాణ రంగానికి వినియోగించే విధానాన్ని మరింత విస్తరించాలి. తాగునీటిని తాగునీటి అవసరాలకే పరిమితం చేసే దిశగా స్పష్టమైన విధానాలు అమలు చేయాలి. ప్రజల బాధ్యత కూడా తక్కువ కాదు. నీటిని పొదుపుగా వినియోగించడం, లీకేజీలను వెంటనే అధికారులకు తెలియజేయడం, వర్షపు నీటి సంరక్షణలో భాగస్వామ్యం కావడం ప్రతి పౌరుడి బాధ్యత. నీరు ప్రభుత్వ ఆస్తి మాత్రమే కాదు; సమాజం మొత్తం సంరక్షించాల్సిన సహజ వనరు. హైదరాబాద్ ఒక ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతోంది. ఐటీ, ఔషధ, సేవారంగాల్లో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. కానీ తాగునీటి భద్రత లేకుండా ఏ నగరమూ స్థిరమైన అభివృద్ధిని సాధించలేదు. భవిష్యత్తులో జనాభా మరింత పెరుగుతుంది. నీటి అవసరం కూడా పెరుగుతుంది. కాబట్టి తాత్కాలిక చర్యలతో కాదు, కనీసం 25 నుంచి 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర నీటి నిర్వహణ వ్యూహాన్ని రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది. హైదరాబాద్ దాహం కేవలం ఒక నగర సమస్య కాదు. అది పట్టణ ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల నిర్వహణ, ప్రజా విధానాల సామర్థ్యాన్ని పరీక్షించే అంశం. ఈరోజు తీసుకునే నిర్ణయాలే రేపటి తరాలకు నీటి భద్రతను నిర్ణయిస్తాయి. నీటి చుక్క విలువను సంక్షోభ సమయంలో కాదు, సమృద్ధిగా ఉన్నప్పుడే గుర్తించి సంరక్షించగలిగితేనే హైదరాబాద్ నిజమైన అర్థంలో సుస్థిర మహానగరంగా నిలుస్తుంది.

# జర్మనీ విద్యా వ్యవస్థ.. ప్రపంచానికి ఆదర్శం

**ప్రపంచంలో నాణ్యమైన విద్యా వ్యవస్థల గురించి మాట్లాడినప్పుడు జర్మనీ పేరు ముందువరుసలో ఉంటుంది. శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, వైద్య, ఇంజినీరింగ్, పరిశోధన, వృత్తి విద్య వంటి రంగాల్లో జర్మనీ సాధించిన విజయాల వెనుక బలమైన, ఆచరణాత్మకమైన విద్యా విధానం ఉంది. అక్కడ విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలు చదవడం, పరీక్షలు రాయడం, మార్కులు సాధించడం మాత్రమే కాదు. విద్యార్థిలో సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, పరిష్కారాలను రూపొందించే నైపుణ్యం, పరిశోధనా దృక్పథం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యం. 1810లో ప్రారంభమైన ఉన్నత విద్యా సంస్కరణలు జర్మనీ ఆధునిక విద్యా వ్యవస్థకు పునాది వేశాయి.**

బోధనతో పాటు పరిశోధన కూడా సమాన ప్రాధాన్యం పొందాలనే భావన అప్పుడే ఆవిర్భవించింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం, ముఖ్యంగా 1949 తర్వాత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను పునర్నిర్మించారు. 1990లో తూర్పు-పశ్చిమ జర్మనీల ఏకీకరణ తర్వాత పరిశోధన, సాంకేతికత, వృత్తి విద్యపై భారీ పెట్టుబడులు పెట్టడంతో జర్మనీ ప్రపంచ స్థాయి జ్ఞాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. జర్మనీ విద్యా విధానంలో అత్యంత విశిష్టమైన అంశం ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం. తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతాన్ని విద్యార్థులు ప్రయోగశాలల్లో, పరిశ్రమల్లో, పరిశోధన ప్రాజెక్టుల్లో ప్రత్యక్షంగా అమలు చేస్తారు. ఒక అంశాన్ని చదవడం మాత్రమే కాకుండా దానిపై నమూనాలు రూపొందించడం, పరీక్షించడం, లోపాలను విశ్లేషించడం, నివేదిక సమర్పించడం వంటి ప్రక్రియల ద్వారా నేర్చుకుంటారు. అందువల్ల పట్టా పూర్తయ్యే సమయానికి విద్యార్థి చేతిలో మార్కుల జాబితా మాత్రమే కాదు, విలువైన అనుభవం కూడా ఉంటుంది. జర్మనీ విద్యా వ్యవస్థలో పరిశ్రమలు కీలక భాగస్వాములు. భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వం కలిసి విశ్లేషించి పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తాయి. అందువల్ల కళాశాలలో నేర్చుకున్నది నేరుగా ఉద్యోగ ప్రపంచానికి అనుసంధానమై ఉంటుంది. ఉద్యోగంలో చేరిన తర్వాత అదనపు శిక్షణ అవసరం తక్కువగా ఉండటం ఇందుకే.

జర్మనీలోని విశ్వవిద్యాలయాలు బోధనా కేంద్రాలే కాదు; అవి పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాలు. పరిశ్రమలతో సంయుక్తంగా కొత్త ఉత్పత్తులు, సాంకేతిక పరిష్కారాల అభివృద్ధిపై నిరంతరం పరిశోధనలు జరుగుతుంటాయి. అనేక సంస్థలు విశ్వవిద్యాలయాల్లోనే పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థులతో కలిసి పనిచేస్తాయి. ఫలితంగా విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చదువుతున్నప్పుడే నేర్చుకునే అవకాశం పొందుతారు. జర్మనీ విద్యా విధానంలో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన మరో అంశం ద్వంద్వ విద్యా విధానం. ఈ విధానంలో విద్యార్థి ఒకేసారి కళాశాలలో సిద్ధాంతాన్ని అభ్యసిస్తూ పరిశ్రమలో ప్రత్యక్ష శిక్షణ పొందుతాడు. వారంలో కొన్ని రోజులు తరగతులు, మిగిలిన రోజులు పరిశ్రమలో పని చేస్తాడు. చదువు పూర్తయ్యే సమయానికి అనుభవజ్ఞుడిగా తయారవడంతో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అందుకే జర్మనీలో యువ నిరుద్యోగిత యూరప్‌లో అత్యల్ప స్థాయిలో ఉండటానికి విద్యా వ్యవస్థ కూడా ఒక ముఖ్య కారణంగా చెప్పబడుతుంది.

విద్యార్థుల మూల్యాంకనంలో కూడా జర్మనీ ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తుంది. తుది పరీక్షలతో పాటు ప్రాజెక్టులు, పరిశోధనలో భాగస్వామ్యం, ప్రయోగాత్మక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం, బృందంగా పనిచేసే తీరు, సమయపాలన వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం ఇస్తారు. దీంతో విద్యార్థులు మార్కుల కోసం కాకుండా నేర్చుకోవడం కోసం చదువుతారు. భారతదేశంలో చాలా కాలం పాటు పరీక్షలు, మార్కులు, జ్ఞాపకశక్తి ఆధారిత విద్యకు ప్రాధాన్యం ఉండేది. ఇటీవలి కాలంలో పరిస్థితి మారుతున్నప్పటికీ, అనేక విద్యాసంస్థల్లో ఇంకా సిద్ధాంత బోధనకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. ఈ కారణంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది పట్టభద్రులు బయటకు వస్తున్నప్పటికీ, వారిలో చాలామందికి ఉద్యోగానికి అవసరమైన అదనపు నైపుణ్య శిక్షణ అవసరమవుతోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు జాతీయ విద్యా విధానం-2020 ప్రవేశపెట్టబడింది. అనుభవాధారిత అభ్యాసం,



నైపుణ్యాభివృద్ధి, బహుళశాఖల అధ్యయనం, పరిశోధన, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా భారత విద్యను ఆచరణాత్మక దిశగా మలచే ప్రయత్నం జరుగుతోంది. అయితే విధాన రూపకల్పనతో పాటు సమర్థవంతమైన అమలు కూడా అంతే కీలకం. ఇటీవల జర్మనీని సందర్శించిన భారత ప్రతినిధి బృందం అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసింది. అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమ--విశ్వవిద్యాలయ అనుసంధానం, ప్రాజెక్టు ఆధారిత బోధన, అధ్యాపకులు-పరిశ్రమ నిపుణుల సమన్వయం, విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనకు ఇచ్చే ప్రాధాన్యం తమను విశేషంగా ఆకట్టుకున్నాయని వారు పేర్కొన్నారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధికి, సాంకేతిక స్వావలంబనకు పునాదిగా ఉండాలనే భావన అక్కడ స్పష్టంగా కనిపించిందని అభిప్రాయపడ్డారు.

జర్మనీ అనుభవం భారతదేశానికి కొన్ని ముఖ్యమైన పాఠాలను నేర్పుతోంది. పరిశ్రమల భాగస్వామ్యంతో పాఠ్య ప్రణాళికల రూపకల్పన, ప్రతి కోర్సులో తప్పనిసరి ప్రాజెక్టులు, దీర్ఘకాలిక పారిశ్రామిక శిక్షణ, విశ్వవిద్యాలయాల్లో ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనకు అధిక పెట్టుబడులు, అధ్యాపకులు--పరిశ్రమల మధ్య నిరంతర సహకారం, విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాల పెంపు వంటి అంశాలను భారత పరిస్థితులకు అనుగుణంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. భారతదేశానికి ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి ఉంది. ఈ యువతను నైపుణ్యవంతమైన మానవ వనరుగా తీర్చిదిద్దగలిగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం మరింత ప్రభావవంతమైన దేశంగా ఎదగగలదు. అందుకోసం విద్యను కేవలం సర్టిఫికెట్ సాధించే ప్రక్రియగా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యం, ఉపాధి, సామాజిక బాధ్యతల సమన్వయంగా చూడాలి. జర్మనీ విద్యా వ్యవస్థ ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తుంది. పట్టా ఒక కాగితం కాదు; అది ఒక నైపుణ్యం. విద్య ఒక పరీక్ష కాదు; జీవితాన్ని నిర్మించే ప్రక్రియ. ప్రాజెక్టు ఒక మార్కు కోసం చేసే పని కాదు; సమాజ సమస్యలకు పరిష్కారం కనుగొనే సాధనం. పరిశోధన గ్రంథాలయంలో ముగిసిపోకూడదు; దేశాభివృద్ధికి దోహదపడాలి. ఈ తత్వాన్ని భారత విద్యా వ్యవస్థలో మరింత బలంగా ఆచరణలోకి తీసుకురాగలిగితే, భారత యువత ప్రపంచ స్థాయి జ్ఞానం, నైపుణ్యం, ఆవిష్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగలరు.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# కాళేశ్వరం.. రైతు జీవనాడి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల్లో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఒకటి. ఇది కేవలం ఒక ఇంజినీరింగ్ అద్భుతం మాత్రమే కాదు; లక్షలాది మంది రైతుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన తెలంగాణలో నీటి కొరతను అధిగమించి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక కీలక మలుపు తిప్పింది. అందుకే కాళేశ్వరాన్ని తెలంగాణ రైతు జీవనాడిగా అభివర్ణిస్తారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే, రాష్ట్రంలోని ఎక్కువ ప్రాంతాలు ఎత్తైన పీఠభూములుగా ఉంటాయి. గోదావరి, కృష్ణా వంటి మహానదులు ప్రవహిస్తున్నప్పటికీ, వాటి నీటిని ఎత్తిపోతల ద్వారా పైభాగాలకు తరలించకపోతే విస్తృతంగా సాగునీరు అందించడం సాధ్యం కాదు. ఈ అవసరాన్ని గుర్తించిన నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. గోదావరి జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్ల గొలుసు ద్వారా వివిధ జిల్లాలకు చేరవేయడం దీని ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టు వల్ల ఎన్నో ప్రాంతాల్లో ఒకే పంట నుంచి రెండు, మూడు పంటలు పండించే పరిస్థితి ఏర్పడింది. బోర్లు ఎండిపోవడంతో సాగును వదిలేసిన రైతులు మళ్లీ వ్యవసాయం వైపు అడుగులు వేశారు. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటల సాగు కూడా విస్తరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం వచ్చింది. వ్యవసాయ ఆధారిత ఉపాధి పెరిగింది. భూగర్భ జలాలు కూడా అనేక ప్రాంతాల్లో మెరుగుపడ్డాయని స్థానికంగా రైతులు చెబుతున్నారు. కాళేశ్వరం ప్రభావం కేవలం పొలాలకే పరిమితం కాకుండా గ్రామీణ జీవన ప్రమాణాలపై కూడా పడింది. అయితే గత కొంతకాలంగా కాళేశ్వరం ప్రాజెక్టు వివిధ కారణాలతో వార్తల్లో నిలుస్తోంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన సాంకేతిక సమస్యలు, మరమ్మతుల అవసరం, నిర్వహణపై వివాదాలు, రాజకీయ విమర్శలు ప్రజల్లో అనేక సందేహాలను కలిగించాయి. ఈ అంశాలపై నిపుణుల కమిటీలు పరిశీలనలు జరుపుతున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలా, నిర్మాణంలో ఎక్కడైనా లోపాలున్నాయా అనే విషయాలు సంబంధిత సంస్థలు తేల్చాల్సిన అంశాలు. కానీ ఈ ప్రక్రియలో



అత్యంత ముఖ్యమైన విషయం మాత్రం మరువరాదు.. ప్రాజెక్టు ద్వారా సాగునీరు పొందే రైతుల ప్రయోజనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ దెబ్బతినకూడదు. ఇటీవలి కాలంలో వర్షపాతం అస్థిరంగా మారుతోంది. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఎండలు, మరోవైపు అనిశ్చిత వర్షాలు రైతును ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి సమయంలో భారీ సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యం మరింత పెరుగుతుంది. రిజర్వాయర్లలో నీరు నిల్వ ఉండి, అవసరమైన సమయంలో పంటలకు అందితేనే రైతు ఆర్థికంగా నిలదొక్కుకోగలడు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు ఈ భరోసాను కల్పించగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో, దాని నిర్వహణ అంతకంటే ముఖ్యమైనది. పంప్ హౌస్‌లు, బ్యారేజీలు, కాలువలు, రిజర్వాయర్ల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలి. నిరంతర సాంకేతిక తనిఖీలు నిర్వహించాలి. అవసరమైన మరమ్మతులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలి. ఆధునిక సెన్సార్లు, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థలు, స్వతంత్ర సాంకేతిక ఆడిట్లు నిర్వహించడం ద్వారా భవిష్యత్‌లో సమస్యలను నివారించవచ్చు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ఇలాంటి భారీ ప్రాజెక్టుల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. రాజకీయాలు ప్రజాస్వామ్యంలో సహజమే. కానీ రైతు ప్రయోజనాల విషయంలో రాజకీయ విభేదాలు అడ్డంకిగా మారకూడదు. అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కాళేశ్వరం నిర్వహణపై నిర్మాణాత్మక సూచనలు చేయాలి. లోపాలుంటే సరిదిద్దాలి; మంచి అంశాలను కొనసాగించాలి. ప్రాజెక్టును రాజకీయ ఆరోపణల వేదికగా మార్చడం కంటే, రైతుకు నీరు అందేలా చూడడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత. భవిష్యత్‌లో తెలంగాణ వ్యవసాయ భద్రత, ఆహార ఉత్పత్తి, గ్రామీణ ఆర్థికాభివృద్ధి కాళేశ్వరం వంటి సాగునీటి వ్యవస్థల సమర్థ నిర్వహణపైనే ఆధారపడి ఉంటుంది. రైతు పంట పండితేనే గ్రామం నిలుస్తుంది; గ్రామం బలపడితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందువల్ల కాళేశ్వరం ఒక నిర్మాణం మాత్రమే కాదు, తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తుకు పునాది. కాళేశ్వరం గురించి చర్చించేటప్పుడు ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. తప్పులు జరిగి ఉంటే వాటిని నిష్పక్షపాతంగా విచారించాలి. బాధ్యులను చట్టపరంగా జవాబుదారులను చేయాలి. అదే సమయంలో ప్రాజెక్టు ప్రయోజనాలు ఆగిపోకుండా, సాగునీటి సరఫరా అంతరాయం కలగకుండా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చర్యలు తీసుకోవాలి. రైతు చేతిలో నీరు ఉంటేనే అతని చేతిలో పంట ఉంటుంది. పంట ఉంటేనే తెలంగాణ సుసంపన్నంగా ఉంటుంది. అందుకే కాళేశ్వరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు... తెలంగాణ రైతు జీవనాడి.



**నవీన్ పోగుల**
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.